



Truth of News RNI NO : APTEL/25/A0239

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్: మొఘల్ ఇర్షాద్ బేగ్



IRS PUBLICATIONS
irspublications12@gmail.com



సంపుటి: 01 | చిత్తూరు | సంచిక : 80 | ఆదివారం 17 ఆగస్టు 2025 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi




## భారత పర్యటనకు చైనా విదేశాంగ మంత్రి

- సరిహద్దు సమస్యపై జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌తో చర్చలు
- విదేశాంగ మంత్రి జైశంకర్‌తోనూ ద్వైపాక్షిక సమావేశం
- గల్వాన్ ఘర్షణల తర్వాత సంబంధాల పునరుద్ధరణకు ఇరుదేశాల ప్రయత్నాలు
- ఈ నెలాఖరులో చైనాలో జరగనున్న ఎస్‌సీఓ సదస్సుకు ప్రధాని మోదీ హాజరయ్యే సూచనలు

**న్యూఢిల్లీ - సూర్య వాస్తవం, ఆగస్టు 16**

భారత్-చైనా మధ్య సరిహద్దు వివాద పరిష్కార దిశగా మరో కీలక ముందడుగు పడింది. చైనా విదేశాంగ శాఖ మంత్రివాంగ్ యీ వచ్చే వారం భారత్‌లో పర్యటించనున్నారు. - మిగతా 2లో..

## బీహార్‌లో రాహుల్ గాంధీ 'ఓట్ అధికార్ యాత్ర' ప్రారంభం

- ఓటర్ల జాబితాలో అక్రమాలపై కాంగ్రెస్ తీవ్ర నిరసన
- 16 రోజుల పాటు రాష్ట్రంలోని 23 జిల్లాల్లో యాత్ర
- యాత్రకు మద్దతు ప్రకటించిన మహాగఠ్‌బంధన్ మిత్రపక్షాలు
- ఓట్ల తొలగింపును 'ఓట్‌బందీ'గా అభివర్ణించిన విపక్షాలు
- రాహుల్ ఆరోపణలను తీవ్రంగా ఖండించిన ఎన్నికల సంఘం



**న్యూఢిల్లీ - సూర్య వాస్తవం, ఆగస్టు 16**

బీహార్ రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. ఓటర్ల జాబితా నుంచి పేర్లను అక్రమంగా తొలగిస్తున్నారని ఆరోపిస్తూ, దీనిని 'ఓట్‌బందీ'గా అభివర్ణిస్తూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆందోళన బాట పట్టారు. ఎన్నికల సంఘం (ఈసీ) - మిగతా 2లో..

## రూ.38,717 కోట్ల వ్యయం, 97శాతం పురోగతి

### -కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య

**బెంగళూరు- సూర్య వాస్తవం, ఆగస్టు 16**



గత సంవత్సరం, ఎస్‌సీఎస్‌పి/టీఎస్‌పీ సంక్షేమ కార్యక్రమాల కోసం రూ. 38,793 కోట్లు విడుదల చేయగా, అందులో రూ. 38,717 కోట్లు ఖర్చు చేయడం ద్వారా 97% పురోగతి సాధించారు. కేంద్ర ప్రభుత్వం నుండి రావాల్సిన రూ. 880 కోట్ల గ్రాంట్ విడుదల కాలేదని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అన్నారు. ఈరోజు విధానసౌధలో జరిగిన రాష్ట్ర షెడ్యూల్డ్ కులాలు/షెడ్యూల్డ్ తెగల అభివృద్ధి మండలి సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ఎస్-సీఎస్‌పి/టీఎస్‌పీ చట్టం అమలులోకి వచ్చి 10 ఏళ్లు పూర్తయిన సందర్భంగా, ఐస్‌ఈసీసీ ద్వారా దాని అమలు పురోగతిపై అంచనా వేసా మని అన్నారు. షెడ్యూల్డ్ కులాలు - మిగతా 2లో..

## హైదరాబాద్‌కు ప్రపంచస్థాయి గుర్తింపు తెచ్చిన ఘనత చంద్రబాబుదే..

### - రేవంత్‌రెడ్డి ప్రశంసలు



**హైదరాబాద్- సూర్య వాస్తవం, ఆగస్టు 16**

హైదరాబాద్‌లోని హైటెక్ సిటీని ప్రపంచ ఐటీ కేంద్రంగా మార్చిన ఘనత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకే దక్కుతుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. నిన్న మాదాపూర్‌లోని హైటెక్స్‌లో జరిగిన క్రెడాయ్ ప్రాపర్టీ షోలో - మిగతా 2లో..

## పేదవాడు ఆత్మగౌరవంతో తలెత్తుకునేలా సంక్షేమాన్ని అందిస్తా

- వ్యక్తిగత పగకోసం పదవిని వాడను
- ఆ స్థాయి ఉంటేనే శత్రువుగా భావిస్తా..
- హాసిత భాష్పాలు పుస్తకావిష్కరణలో సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్ - సూర్య వాస్తవం, ఆగస్టు 16**

అద్దాల మేడలు, రంగుల గోడలు అభివృద్ధి కాదనీ, పేద వాడు తలెత్తుకుని తిరిగేలా పాలన సాగినప్పుడే నిజమైన అభివృద్ధి అని అంబేద్కర్ వ్యాఖ్యానించినట్టుగా తమ సర్కారు పేదల కోసం పనిచేస్తున్నదని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్‌లో తెలంగాణ కవి అందెశ్రీ రచించిన 'హాసిత భాష్పాలు' పుస్తకాన్ని సీఎం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రజల - మిగతా 2లో..



## ట్రంప్-పుతిన్ భేటీపై భారత్ హర్షం

- అలస్కాలో జరిగిన ట్రంప్-పుతిన్ భేటీని స్వాగతించిన భారత్
- శాంతి కోసం ఇరు దేశాధినేతల చొరవ అభినందనీయం అని వెల్లడి
- ఉక్రెయిన్ వివాదానికి ముగింపు పలకాలని పిలుపు

**న్యూఢిల్లీ - సూర్య వాస్తవం, ఆగస్టు 16**

ప్రపంచ శాంతి స్థాపన దిశగా అమెరికా, రష్యా అధ్యక్షులు తీసుకున్న చొరవను భారత్ మనస్ఫూర్తిగా స్వాగతించింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మధ్య అలస్కాలో జరిగిన శిఖరాగ్ర సమావేశంపై భారత ప్రభుత్వం - మిగతా 2లో..

## ఏపీలో మరో అల్పపీడనం...

- రెండు అల్పపీడనాలతో విస్తారంగా వర్షాలు
- వాయవ్య బంగాళాఖాతంలో సోమవారం మరో అల్పపీడనం
- రానున్న మూడు రోజులు కోస్తాంధ్రకు భారీ వర్షాలు
- రాయలసీమలో తేలికపాటి నుంచి మోస్తరు జల్లుల అంచనా
- 19 వరకు మత్స్యకారులకు వేటపై నిషేధం
- నేటు పలు కోస్తా జిల్లాల్లో కుండపోత వర్షాలకు అవకాశం



**అమరావతి- సూర్య వాస్తవం, ఆగస్టు 16**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి భారత వాతావరణ శాఖ కీలక వర్ష సూచన జారీ చేసింది. వాయవ్య బంగాళాఖాతంలో ఆగస్టు 18, సోమవారం నాటికి మరో కొత్త అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. ఇప్పటికే ఉన్న అల్పపీడనానికి ఇది తోడవడంతో, - మిగతా 2లో..

## అది తాత్కాలికమే

- ప్రజలకు కృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలిపిన జగన్
- ధర్మం నెమ్మదిగా ముందుకెళ్లినా అది శాశ్వతమని వ్యాఖ్య
- శ్రీకృష్ణుని జీవితం దీనికి నిదర్శనమని ట్వీట్

2లో

**అమరావతి - సూర్య వాస్తవం, ఆగస్టు 16**



శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా వైసీపీ అధినేత జగన్ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఆసక్తికర ట్వీట్ చేశారు

## సూపర్ సిక్స్... సూపర్ ఫ్లాప్: షర్మిల



- సీఎం చంద్రబాబు ప్రజలను ఘోరంగా మోసం చేశారని షర్మిల ఆరోపణ
- ఏడాది పాలనలో హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని
- జాబ్ క్యాలెండర్, 20 లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, - మహిళలకు సాయం హామీలు గాలికి
- తల్లికి వందనం, రైతు పథకాలకు కోతలు పెట్టారని ఆరోపణ - 14 నెలల తర్వాత బస్సు ఫ్రీ ఇచ్చి గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటు

2లో


సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి


## 'స్త్రీ శక్తి' పథకం మహిళల స్వేచ్ఛకు, గౌరవానికి ప్రతీక

- 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 'స్త్రీ శక్తి' పథకం ప్రారంభం
- సూపర్ సిక్స్ హామీల్లో ఒకటైన ఉచిత బస్సు పథకాన్ని అమలు చేసిన కూటమి ప్రభుత్వం
మహిళల స్వేచ్ఛకు, గౌరవానికి ప్రతీక

2లో



## బీహార్‌లో రాహుల్ గాంధీ

# ‘ఓట్ అధికార్ యాత్ర’ ప్రారంభం

(మొదటిపేజీ తరువాయి)

తీరుకు నిరసనగా ఆయన శనివారం ‘ఓట్ అధికార్ యాత్ర’ను ప్రారంభించారు. ఈ యాత్ర రాష్ట్రవ్యాప్తంగా 16 రోజుల పాటు సాగనుంది. ఆదివారం నుంచి లాంఛనంగా ప్రారంభం కానున్న ఈ యాత్ర 23 జిల్లాల మీదుగా కొనసాగనుంది. ససారామ్‌లో ఈ యాత్రను ప్రారంభించారు. ఈ నిరసన కార్యక్రమానికి మహాగఠ్‌బంధన్ మిత్రపక్షాలు కూడా పూర్తి మద్దతు ప్రకటించాయి. కాంగ్రెస్‌తో కలిసి తాము కూడా ప్రజలను సమీకరిస్తామని ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ తెలిపారు.

బీహార్ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఈసీ చేపట్టిన ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై విపక్షాలు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయి. ఈసీ, బీజేపీతో కుమ్మక్కై ఓట్లను తొలగిస్తోందని ఆగస్టు 7న రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు చేశారు. దీనికి ఆధారంగా కర్ణాటకలోని మహదేవపుర అసెంబ్లీ సెగ్మెంట్ డేటాను ఆయన ప్రస్తావించారు. అయితే, ఈ ఆరోపణలను ఎన్నికల సంఘం తీవ్రంగా ఖండించింది. అఫిడవిట్ రూపంలో ఫిర్యాదు చేయాలని కోరగా, తాను రాజ్యాంగంపై ప్రమాణం చేసినందున ఆ అవసరం లేదని రాహుల్ బదులిచ్చారు.

“ప్రతి వ్యక్తికి ఒక ఓటు అనేది ప్రాథమిక ప్రజాస్వామ్య హక్కు. దానిని కాపాడేందుకే ఈ పోరాటం. రాజ్యాంగ పరిరక్షణ కోసం బీహార్‌లో మాతో కలవండి” అని రాహుల్ గాంధీ ‘ఎక్స్’ వేదికగా పిలుపునిచ్చారు. మరోవైపు, తేజస్వీ యాదవ్ ఈ యాత్ర కోసం ఒక ప్రచార గీతాన్ని విడుదల చేశారు. “ఏ ఒక్క ఓటరు పేరు జాబితా నుంచి పోకూడదు. ప్రజల్లో చైతన్యం తేవడమే మా లక్ష్యం” అని ఆయన స్పష్టం చేశారు. బీహార్‌లో 65 లక్షల ఓట్లు తొలగించారని సుప్రీంకోర్టు పేర్కొన్న విషయాన్ని కూడా విపక్షాలు ఈ సందర్భంగా గుర్తుచేస్తున్నాయి.

## భారత పర్యటనకు చైనా విదేశాంగ మంత్రి

(మొదటిపేజీ తరువాయి)

ఈ నెల 18, 19 తేదీల్లో ఆయన పర్యటన ఉంటుందని, ఈ సందర్భంగా ఇరు దేశాల మధ్య ప్రత్యేక ప్రతినిధుల (ఎస్ఆర్) స్థాయిలో 24వ విడత చర్చలు జరుగుతాయని భారత విదేశాంగ శాఖ శనివారం ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ పర్యటనలో భాగంగా వాంగ్ యీ, భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌తో సమావేశమై సరిహద్దు సమస్యపై ప్రధానంగా చర్చిస్తారు. అనంతరం, విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్‌తో కూడా ద్వైపాక్షిక అంశాలపై చర్చలు జరుపుతారు. 2020 జూన్‌లో గల్వాన్ లోయలో జరిగిన ఘర్షణల తర్వాత ఇరు దేశాల మధ్య సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ ఉన్నతస్థాయి సమావేశానికి ప్రాధాన్యత ఏర్పడింది.

గత కొంతకాలంగా ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు తగ్గుముఖం పడుతున్నాయి. గత ఏడాది అక్టోబర్‌లో తూర్పు లడఖ్‌లోని డెమ్చోక్, డెప్సాంగ్ ప్రాంతాల నుంచి సైనికుల ఉపసంహరణ ప్రక్రియ పూర్తి కావడంతో ఉద్రిక్తతలు సద్దుమణిగాయి. సంబంధాల పునరుద్ధరణలో భాగంగా గత డిసెంబరులో అజిత్ దోవల్ చైనాలో పర్యటించి వాంగ్ యీతో చర్చలు జరిపారు. ఆ తర్వాత భారత్ చైనా పౌరులకు పర్యాటక వీసాలను కూడా తిరిగి ప్రారంభించింది.

ఈ పరిణామాల మధ్య, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ నెలాఖరులో చైనాలో పర్యటించే అవకాశాలు కనిపిస్తున్నాయి. చైనాలోని టియాంజిన్‌లో జరిగే షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) సదస్సుకు ఆయన హాజరుకావొచ్చని తెలుస్తోంది. అయితే, దీనిపై ఇంకా అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. ఈ పర్యటన ఖరారైతే, 2018 తర్వాత ప్రధాని మోదీ చైనాలో పర్యటించడం ఇదే తొలిసారి అవుతుంది.

## ట్రంప్-పుతిన్ భేటీపై భారత్ హర్షం

(మొదటిపేజీ తరువాయి)

సానుకూలంగా స్పందించింది. ఇరు దేశాధినేతల నాయకత్వ పటిమను ప్రశంసిస్తూ, ఈ చర్చలు సానుకూల వాతావరణానికి దోహదపడతాయని ఆశాభావం వ్యక్తం చేసింది. ఈ మేరకు భారత విదేశాంగ శాఖ ఈరోజు ఒక ప్రకటన విడుదల చేసింది. ఉక్రెయిన్‌లో కొనసాగుతున్న వివాదానికి వీలైనంత త్వరగా ముగింపు పలకాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పింది. ఇందుకు చర్చలు, దౌత్యపరమైన మార్గాలే అత్యంత కీలకమని పునరుద్ఘాటించింది. అలస్కా సమావేశంలో ఇరు దేశాల మధ్య జరిగిన చర్చల్లో పురోగతిని భారత్ అభినందిస్తున్నట్లు పేర్కొంది.

ప్రపంచంలోని రెండు అతిపెద్ద శక్తుల మధ్య సంప్రదింపులు జరగడం అంతర్జాతీయంగా శాంతియుత వాతావరణాన్ని బలోపేతం చేస్తుందని విదేశాంగ శాఖ అభిప్రాయపడింది. ఎలాంటి సమస్యనైనా సామరస్యపూర్వక చర్చల ద్వారా పరిష్కరించుకోవచ్చనే విధానానికి భారత్ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని ఈ సందర్భంగా మరోసారి స్పష్టం చేసింది.

## పేదవాడు ఆత్మగౌరవంతో తలెత్తుకునేలా సంక్షేమాన్ని అందిస్తా

(మొదటిపేజీ తరువాయి)

ం తమపై పెద్ద బాధ్యత పెట్టారని చెప్పారు. నాలుగు కోట్ల మంది సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నానని అన్నారు. సీఎం పదవి నా చేతుల్లో ఉన్నంత కాలం ప్రజల కోసం పనిచేస్తానని స్పష్టం చేశారు. నాలుగున్నర లక్షల మంది సొంతింటి కల నెరవేరుస్తున్నామనీ, మూడు కోట్ల మందికి సన్నబియ్యం ఇస్తున్నామని అన్నారు. రాచరికం నుంచి ప్రజాస్వామ్యంలోకి వచ్చిన ఆనందంలో ప్రజలున్నారని గుర్తు చేశారు. ప్రతి రోజూ ప్రజలతో ఉండే అవకాశం వచ్చిందన్నారు. పోరాటానికి స్ఫూర్తినిచ్చిన గడ్డ తెలంగాణ అనీ, 2047 వరకు మూడు ట్రిలియన్ డాలర్ ఎకానమీ తన లక్ష్యమని చెప్పారు. తెలంగాణ సమాజం కవులకు, పోరాటానికి స్ఫూర్తినిచ్చిన గడ్డ అని కొనియాడారు. ఉద్యమంలో ప్రజలకు ఎంతో మంది కవులు స్ఫూర్తిగా నిలిచారని చెప్పారు. గూడ అంజన్న, దాశరథి, కాళోజీ, అందెశ్రీ, గద్దర్, గోరటి వెంకన్న ఇలా అనేక మంది ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. కొందరు నకిలీ ఉద్యమకారులు తామే ఉద్యమకారులమని చెప్పుకుంటూ తిరుగుతున్నారని విమర్శించారు. ఉద్యమకారులని చెప్పుకునే వాళ్లకు అన్ని వేల కోట్లు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. తెలంగాణతో పేగు బంధం,పేరు బంధం అన్ని తెంచుకున్నారని విమర్శించారు. దేశానికి నాయకత్వం వహించాలనే దురాశతో అన్నీ కోల్పోయారని అన్నారు. వారు అలా చెప్పుకొని తిరగడానికి కారణం.. నిజమైన ఉద్యమ కారులు ఎవ్వరూ కూడా మేము ఉద్యమకారులం అని చెప్పుకోకవడమేనని తెలిపారు. నిజమైన ఉద్యమకా రులంతా గర్వంగా చెప్పుకోవాలని సూచించారు. రాజకీయాల్లో తాను ఎవరినీ శత్రువులుగా చూడననీ, అలా చూడాలన్నా వాళ్ళకి ఆ స్థాయి ఉండాలని తెలిపారు. శత్రువులకు నా గెలుపే అసలైన శిక్ష అని చెప్పారు. తనకు రాజకీయాల్లో శత్రువులెవరూ లేరన్నారు. వ్యక్తిగత పగకోసం తన పదవిని అడ్డం పెట్టుకుంటే తనకన్నా మూర్ఖుడు ఇంకొకరు ఉండరని అభిప్రాయపడ్డారు. తనకు అన్ని చట్ట సభల్లో పనిచేసిన అనుభవం ఉందన్నారు. కార్యక్రమంలో శ్రీరామ్, అందెశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## రూ.38,717 కోట్ల వ్యయం,

# 97శాతం పురోగతి

(మొదటిపేజీ తరువాయి)

మరియు తెగల జనాభా అధికంగా ఉన్న 39 తాలూకాలను గుర్తించి అధ్యయనం నిర్వహించామని చెప్పారు. విద్య, ఆరోగ్యం, జీవన ప్రమాణాల మెరుగుదల మరియు పేదరిక నిర్మూలన ప్రమాణాలను పరిగణనలోకి తీసుకుని ఈ సర్వే నిర్వహించినట్లు ఆయన చెప్పారు.

ఈ కాలంలో అభివృద్ధి గ్రాంట్ల విడుదలలో వార్షిక వృద్ధి 9.6%. గత 10 సంవత్సరాలలో కర్ణాటక ఇతర రాష్ట్రాలతో పోలిస్తే వివిధ పారామితులలో ముందంజలో ఉందని స్పష్టంగా తెలుస్తుంది. చట్టం ప్రకారం, ప్రతి సంవత్సరం కనీసం 24.1% గ్రాంట్ ఇవ్వాలి. కానీ 2019-20లో, పేర్కొన్న శాతం కంటే తక్కువ గ్రాంట్ విడుదల చేయబడింది. చట్టం అమలు చేసినప్పటి నుండి మొత్తం రూ. 2.97 లక్షల కోట్లు ఖర్చు చేయబడ్డాయి. పథకం సక్రమంగా అమలు చేయబడుతుందో లేదో సమీక్షించాలని ఆయన అధికారులను ఆదేశించారు.

జనాభాకు అనుగుణంగా బడ్జెట్ నిధులను కేటాయించడం, సామాజిక మరియు ఆర్థిక పరిస్థితులను మెరుగుపరచడం మరియు జీవన ప్రమాణాలు మరియు గృహాలను అభివృద్ధి చేయడం ఈ చట్టం యొక్క ఉద్దేశ్యం. ఈ చట్టం యొక్క ఉద్దేశ్యం ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడకూడదు. షెడ్యూల్డ్ కులాలు/తెగల ప్రజల సామాజిక, ఆర్థిక మరియు విద్యా పరిస్థితులను మెరుగుపరచడానికి సంబంధిత విభాగాలు సరైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించి, ప్రణాళిక ప్రకారం పనిచేయాలి. అమలు విభాగానికి నిబద్ధత అవసరం. గత 10 సంవత్సరాలలో ఆశించిన మార్పు సాధ్యం కాలేదని ఆయన అన్నారు.

వివిధ సంక్షేమ పథకాల కింద బ్యాంకులు సకాలంలో ఆర్థిక సహాయం అందించేలా చూడాలని ఆయన అధికారులను ఆదేశించారు. రుణ సౌకర్యాలు అందించడంలో జాప్యం చేసే బ్యాంకులపై చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వ పథకాలు 100 శాతం ఎస్సీ/ఎస్టీ ప్రజలకు చేరేలా చర్యలు తీసుకోవాలి. ఈ సంవత్సరం, మేము రూ. 42,017.51 కోట్లు కేటాయించాము. ఈ గ్రాంట్‌ను సముచితంగా ఖర్చు చేయడానికి, వీలైనంత త్వరగా ఒక కార్యాచరణ ప్రణాళికను రూపొందించి, సమర్థవంతంగా అమలు చేయాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ గ్రాంట్లు పెండింగ్‌లో ఉండకూడదు. 100 శాతం పురోగతి సాధించాలి.

నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులను చట్టం ప్రకారం శిక్షించాలని ఆయన అన్నారు. ఇప్పటివరకు ఖర్చు చేసిన రూ. 2.97 లక్షల కోట్లు: కర్ణాటక చరిత్రలో షెడ్యూల్డ్ కులాలు మరియు షెడ్యూల్డ్ తెగల సంక్షేమ పథకాలకు ఇప్పటివరకు రూ. 2.97 లక్షల కోట్లు ఖర్చు చేశారు. ఇంత ఖర్చు చేసినప్పటికీ సామాజిక, ఆర్థిక మరియు విద్యా జీవన ప్రమాణాలు మెరుగుపడకపోతే అది సిగ్గుచేటు. గత సంవత్సరంలో, %బాజ్జూా/బ్రూా% గృహ పథకాలకు రూ. 1,086 కోట్లు విడుదలయ్యాయి. అర్హత ఉన్న ప్రతి షెడ్యూల్డ్ కులం/టిబెటన్ అభ్యర్థికి గృహ సౌకర్యాలు కల్పించడానికి చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అన్నారు.

## హైదరాబాద్‌కు ప్రపంచస్థాయి గుర్తింపు తెచ్చిన

# ఘనత చంద్రబాబుదే..

(మొదటిపేజీ తరువాయి)

పాల్గొన్న రేవంత్ రెడ్డి ఈ వ్యాఖ్యలు చేశారు. 1990లలో ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు నాయుడు హైటెక్ సిటీ ప్రాజెక్టును ఊహించి, అభివృద్ధి చేయడంలో కీలక పాత్ర పోషించారని ఆయన గుర్తు చేశారు. “కొందరు గుర్తించబడతారు, మరికొందరు గుర్తించబడరు. కానీ హైటెక్ సిటీ అభివృద్ధికి ఉన్న క్రెడిట్ చంద్రబాబు నాయుడుకే దక్కాలి” అని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

రాజకీయంగా ప్రత్యర్థులు అయినప్పటికీ రేవంత్ రెడ్డి, చంద్రబాబు నాయుడు మధ్య ఒక ప్రత్యేక బంధం ఉంది. పాలన గురించి చాలామంది యువ రాజకీయ నాయకులకు, రేవంత్‌కు కూడా నేర్పించిన ఘనత చంద్రబాబుకే ఉందని చెబుతారు. హైదరాబాద్ ఐటీ పరిశ్రమకు వెన్నెముకను నిర్మించిన ఘనత కూడా ఆయనకే దక్కుతుంది. రేవంత్ రెడ్డి బహిరంగంగా చేసిన ఈ ప్రశంస, హైదరాబాద్ అభివృద్ధిలో చంద్రబాబు విధానాలు ఎంతగా ప్రభావం చూపాయో చాటి చెప్పింది.

## ఏపీలో మరో అల్పపీడనం...

(మొదటిపేజీ తరువాయి)

రాబోయే మూడు రోజుల పాటు రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురుస్తాయని తెలిపింది.విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ ఈ వివరాలను మీడియాకు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం, ఈ అల్పపీడనాల ప్రభావంతో కోస్తాంధ్ర జిల్లాల్లో అక్కడక్కడ భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉంది. అదే సమయంలో రాయలసీమ ప్రాంతంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షపాతం నమోదవుతుందని ఆయన అంచనా వేశారు. సముద్రం అల్లకల్లోలంగా ఉండే ప్రమాదం ఉన్నందున, మత్స్యకారులు మంగళవారం వరకు వేటకు వెళ్లరాదని ఆయన స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారు. ఆదివారం నాటి వాతావరణ పరిస్థితులపై మాట్లాడుతూ, ఉత్తర కోస్తాలోని అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రఖర్ జైన్ తెలిపారు. శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, కోనసీమ, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు పడతాయని, మిగిలిన జిల్లాల్లో తేలికపాటి జల్లులు ఉంటాయని వివరించారు. వర్షాల నేపథ్యంలో ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

## అది తాత్కాలికమే

(మొదటిపేజీ తరువాయి)

. అధర్మం ఎంత బలంగా ఉన్నా అది తాత్కాలికమని ఆయన పేర్కొన్నారు. ధర్మం ఎంత నెమ్మదిగా ముందుకెళ్లినా అది శాశ్వతం అని చెప్పారు. శ్రీకృష్ణుని జీవితం దీనికి నిదర్శనమని అన్నారు. ఈ కృష్ణాష్టమి మీకు శాంతిని, ప్రేమను, విజయాన్ని తీసుకురావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని తెలిపారు.

# అప్రమత్తంగా ఉండండి

### - వర్షాల నేపథ్యంలో అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

హైదరాబాద్ - సూర్య వాస్తవం, ఆగస్టు 16

భారీ వర్షాల నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. నిజామాబాద్, సంగారెడ్డి, మెదక్, వికారాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందనే వాతావరణ శాఖ సూచనల నేపథ్యంలో శనివారం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ నివాసం నుంచి సీఎం.. ఉన్నతాధికారులతో మాట్లాడి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన వారికి పలు సూచనలు చేశారు. వర్షాల ప్రభావం ఎక్కువగా ఉండే జిల్లాల్లో ఎస్‌డీఆర్ఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలను మోహరించాలని దిశానిర్దేశం చేశారు. వాగులు, వంకలు పొంగిపొర్లే ప్రమాదమున్నందున జిల్లా అధికారులు అప్రమత్తంగా ఉండాలనీ, లోతట్టు ప్రాంతాల్లోని కుటుంబాలను సహాయక శిబిరాలకు తరలించాలని ఆదేశించారు. నీటి పారుదల శాఖ అధికారులు, సిబ్బంది రిజర్వాయర్లు, చెరువులు, కుంటల నీటి మట్టాన్ని ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. నీటి విడుదలపై ముందుగానే కలెక్టర్లు, క్షేత్ర స్థాయి సిబ్బందికి సమాచారం ఇవ్వాలన్నారు. పూర్తిగా నిండిన చెరువులు, రిజర్వాయర్ల వద్ద ఇసుక బస్తాలను సిద్ధంగా ఉంచాలని సీఎం ఆదేశించారు. రోడ్లపై నీరు నిలిచిన ప్రాంతాల్లో, లోలెవల్ బ్రిడ్జిలు, కాజ్‌వేలపై నుంచి రాకపోకలు పూర్తిగా నిషేధించాలని సూచించారు.

# సూపర్ సిక్స్... సూపర్ ఫ్లాప్: షర్మిల

### - సీఎం చంద్రబాబు ప్రజలను ఘోరంగా మోసం చేశారని షర్మిల ఆరోపణ
### - ఏడాది పాలనలో హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని ధ్వజం ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, - మహిళలకు సాయం హామీలు గాలికి
### - తల్లికి వందనం, రైతు పథకాలకు కోతలు పెట్టారని ఆరోపణ - 14 నెలల తర్వాత బస్సు ఫ్రీ ఇచ్చి గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటు

**అమరావతి - సూర్య వాస్తవం, ఆగస్టు 16**

ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఎన్నికల ముందు ఎంతో ఆర్భాటంగా ప్రకటించిన ‘సూపర్ సిక్స్’ పథకాలు ‘సూపర్ ఫ్లాప్’ అయ్యాయని, ఇది ప్రజలను ఘరానా మోసం చేయడమేనని ఆమె ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా, ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. “సూపర్ సిక్స్ సూపర్ హిట్ ఎలా అయ్యింది సీఎం చంద్రబాబు గారూ? 20 లక్షల ఉద్యోగాలు అన్నారు... ఒక్కరికైనా ఇచ్చారా? నెలకు రూ.3 వేల భృతి ఏ ఒక్క నిరుద్యోగికైనా అందిందా? 18 ఏళ్లు నిండిన ఒక్క మహిళకైనా నెలకు రూ.15 వందలు అకౌంట్ లో పడ్డాయా? అన్నదాత సుఖీభవ కింద సొంతగా రూ.20 వేలు ఇస్తామని మాట మార్చారు. కేంద్రం ఇచ్చే రూ.6 వేలతో లింక్ పెట్టారు. 30 లక్షల మంది రైతులకు పథకం దక్కకుండా పంగనామాలు పెట్టారు.

తల్లికి వందనం కింద 20 లక్షల మంది బిడ్డలకు పథకంలో కోత పెట్టారు. రూ.15 వేలు ఇస్తామని రూ.13 వేలకు సరిపెట్టారు. మూడు సిలిండర్లు ఎంత మందికి అందుతున్నాయో అర్థంకాని పరిస్థితి! 14 నెలల తర్వాత ఫ్రీ బస్సు అమలు చేసి, సూపర్ సిక్స్ హామీలను ఉద్ధరించామని చెప్పుకోవడం నిజంగా సిగ్గుచేటు. సూపర్ సిక్స్ సూపర్ హిట్ అనడం హాస్యాస్పదం. చంద్రబాబు రాష్ట్ర ప్రజలకు చేసింది ఘరానా మోసం. రాష్ట్రంలో సంక్షేమం సన్నగిల్లింది. అభివృద్ధి అటకెక్కింది. సుపరిపాలన కొండెక్కింది. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో హామీలు ఘనం... అమలు మాత్రం అరచేతిలో వైకుంఠం” అంటూ షర్మిల తీవ్రస్థాయిలో విమర్శనాస్త్రాలు సంధించారు.

## ‘స్త్రీ శక్తి’ పథకం

# మహిళల స్వేచ్ఛకు, గౌరవానికి ప్రతీక

**అమరావతి - సూర్య వాస్తవం, ఆగస్టు 16**

రాష్ట్రంలోని మహిళలకు కానుకగా కూటమి ప్రభుత్వం ‘స్త్రీ శక్తి’ పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణించే సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చింది. తాజాగా రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ ఎక్స్ వేదికగా స్పందిస్తూ... సూపర్ సిక్స్ హామీలలో ఒకటైన ఈ పథకాన్ని ప్రారంభించడం గర్వంగా ఉందని తన పోస్టులో పేర్కొన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం కేవలం ఒక సౌకర్యం మాత్రమే కాదని, అది వారి స్వేచ్ఛకు, గౌరవానికి, ప్రభుత్వంపై వారికున్న నమ్మకానికి నిదర్శనమని ఆయన అభిప్రాయపడ్డారు. “ఈ ఉచిత బస్సు టికెట్ మహిళల సాధికారతకు ప్రతీక. ఇది కేవలం ప్రయాణం కాదు, సమాన అవకాశాల దిశగా వేస్తున్న ఒక ముందడుగు. స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళా సాధికారతకు మా ప్రభుత్వం పట్టం కట్టింది” అని లోకేశ్ తెలిపారు. ఈ చారిత్రక సందర్భాన్ని ఒక వేడుకలా జరుపుకోవాలని ఆయన రాష్ట్రంలోని మహిళలకు పిలుపునిచ్చారు. ప్రయాణ సమయంలో తమ ఉచిత బస్సు టికెట్‌తో సెల్ఫీ దిగి, మహిళా సాధికారత అంటే ఏమిటో ప్రపంచానికి చాటిచెప్పాలని ఆయన కోరారు.

# సంపాదకీయం

## ఇక జియో పొలిటికల్ షిఫ్ట్..



రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, శాశ్వత మిత్రులు అంటూ ఉండరంటారు కదా.. అయితే ఇది కొన్ని సందర్భాల్లో దేశాలకూ వర్తిస్తుంటుంది. ప్రత్యర్థిగా భావిస్తున్న దేశాలతోనే జట్టుకట్టే పరిస్థితి ఉండొచ్చు. ఇప్పుడు భారత్? చైనా బంధం చూస్తుంటే ఇదే నిజమనిపిస్తోంది. ఓవైపు ట్రంప్ దూకుడు భారత్, చైనాకు చాలానే కలిసి వస్తోంది. జియోపొలిటికల్ షిఫ్ట్ అనేది ఒకటి ఉంటుంది. ట్రంప్ కారణంగా ఇది వర్కవుట్ అవుతోంది. భారత్ చైనా మధ్య స్నేహ బంధం. ఒక నమ్మకం సరికొత్త బంధానికి పునాది వేస్తుంది. ఒక అవకాశం.. సత్సంబంధాలను పెంచుతుంది. ఒక అవసరం కలిసి నడిచేలా చేస్తుంది. ఇది ఇప్పుడు భారత్ చైనాకు వర్తిస్తుంది. ఎందుకంటే 2020లో గాల్వన్ లోయలో ఘర్షణ తర్వాత కథ అంతా మారిపోయింది. దూరం పెరిగింది. అయితే ఆ దూరం ఎప్పుడూ అలాగే ఉండదు కదా. ఇటీవలి పరిస్థితులు కలిసి వచ్చాయి. రెండు దేశాల మధ్య మళ్లీ కొత్తబంధం చిగురించేలా చేశాయి. భారత ఉత్పత్తులపై ట్రంప్ 50 శాతం టారిఫ్ లు విధించిన తర్వాత ఈ రెండు దేశాలు దగ్గరవుతున్నాయని ఇప్పుడు అనుకుంటున్నారు. అయితే మార్చిలో చైనాపై 20 శాతం ట్రంప్ టారిఫ్ లు విధించినప్పుడే చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ కలిసి నడుద్దామని పిలుపునిచ్చారు. అమెరికా ఓవరాక్షన్ కు చెక్ పెట్టేందుకు, పవర్ పాలిటిక్స్ ను అడ్డుకునేందుకు కలిసి పని చేద్దామన్నారు. అప్పటి నుంచే భారత్ ? చైనా మధ్య పరిస్థితులు అనుకూలించడం మొదలైంది. చెప్పాలంటే మొదట ఒక మెట్టు చైనానే దిగింది. ఆగస్ట్ 18న చైనా విదేశాంగ మంత్రి రాక. ఆగస్ట్ 18న చైనా విదేశాంగ మంత్రి వాంగ్ ఢిల్లీకి వస్తున్నారు. జాతీయ భద్రతా సలహాదారు దోవల్ తో భేటీ అవుతారు. ఈనెల 31న ప్రధాని మోడీ చైనా పర్యటన కంటే ముందుగానే ఈ పరిణామం చోటు చేసుకుంటుండడం ఆసక్తికరంగా మారుతోంది. ఎందుకంటే మాట్లాడుకునేవి చాలా ఉన్నాయి. పరిష్కరించుకునేవీ ఉన్నాయి. సో ఇటీవలి కాలంలో భారత్ చైనా ప్రతినిధులు, ప్రభుత్వ వర్గాల మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు నడుస్తున్నాయి. రాజకీయంగా పరస్పర విశ్వాసం పెంచుకోవడం, సహకారాన్ని విస్తరించడం ఇవన్నీ రెండు దేశాల మధ్య బంధాన్ని మరో లెవెల్ కు తీసుకెళ్లేలా కనిపిస్తున్నాయి ట్రంప్ టారిఫ్ లకు చెక్ పెడుదామని చైనా ముందుకు రావడం, ప్రధాని మోడీ ఏడేళ్ల తర్వాత చైనాకు వెళ్లాలని డిసైడ్ అవడం, సరిహద్దు వాణిజ్యం మళ్లీ ప్రారంభించాలని అనుకోవడం, బార్డర్ లో పెట్రోలింగ్ విధానాన్ని పునరుద్ధరించడం, డైరెక్ట్ ఫ్లైట్ సర్వీసులు తిరిగి ప్రారంభించాలను కోవడం, చైనీస్ పౌరులకు టూరిస్టుల వీసాల మంజూరుపై ముందడుగు పడడం, చైనా కంపెనీల పెట్టుబడుల నిబంధనలను సడలించాలనుకోవడం ఇవన్నీ కీలక పరిణామాలుగా కనిపిస్తున్నాయ్. సరిహద్దు వాణిజ్యం మళ్లీ మొదలు పెట్టేలా చర్చలు. ఓవరాల్ గా చూస్తే భారత్ చైనా మధ్య సరిహద్దు వాణిజ్యం, ద్వైపాక్షిక సంబంధాల్లో మెరుగుదల కనిపిస్తోంది. ముఖ్యంగా 2020 గల్వాన్ ఘర్షణ తర్వాత ఏర్పడిన ఉద్రిక్తతల నుంచి రిలీఫ్ కనిపిస్తోంది. ఈ సంబంధాలు పెరగడంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వాణిజ్య విధానాలు, భారత్‌పై విధించిన అధిక టారిఫ్ లు కీలకంగా మారాయి. ఫస్ట్.. 2020లో గల్వాన్ ఘర్షణ తర్వాత నిలిపేసిన సరిహద్దు వాణిజ్యాన్ని పునఃప్రారంభించేందుకు చర్చలు జరుగుతున్నాయి. ఈ ట్రేడ్ ఉత్తరాఖండ్ లిపులేఖ్ పాస్, హిమాచల్ ప్రదేశ్ షిప్కీ లా పాస్, అలాగే సిక్కిం నాథు లా పాస్ ఇలా మూడు హిమాలయన్ సరిహద్దుల ద్వారా జరుగుతుంది. ఈ సరిహద్దు వాణిజ్యం విలువలో చిన్నదైనప్పటికీ రెండు దేశాల మధ్య సామాజిక ఆర్థిక సంబంధాలను మెరుగు పరచడంలో కీ సిగ్నల్‌గా ఉంది. సో ఇది త్వరలో ప్రారంభించాలనుకోవడంపై చైనా రియాక్ట్ అయింది. ఈ వాణిజ్యంతో సరిహద్దు ప్రాంత వాసుల లైఫ్ క్వాలిటీని మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తుందన్నది చైనా. 2020కి ముందున్న పెట్రోలింగ్ విధానం పునరుద్ధరణ. భారత్ చైనా మధ్య దౌత్యపరమైన పురోగతి కూడా కనిపిస్తోంది. 2024 అక్టోబర్‌లో కుదిరిన ఒప్పందంతో 2020కి ముందు ఉన్న పెట్రోలింగ్ విధానాన్ని పునరుద్ధరించారు. ఐదేళ్ల తర్వాత ఇదొక కీలక ముందడుగుగా మారింది. అటు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆగస్టు 31న షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ ? సమ్మిట్ కోసం చైనాకు వెళ్లనున్నారు. ఏడేళ్ల తర్వాత చైనా పర్యటనకు మోడీ వెళ్తుండడం ఇదే తొలిసారి. ఈ టైంలో చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌తో భేటీ జరగనుంది. అటు 2020 నుండి నిలిపేసిన డైరెక్ట్ ఫ్లైట్ సర్వీసులు తిరిగి ప్రారంభం కాను న్నాయి. రెడీగా ఉండాలని విమానయాన సంస్థలకు కేంద్రం సూచించింది కూడా. చైనాతో భారత్‌కు 85 బి. డాలర్ల వాణిజ్య లోటు. సో ఈ ప్రయత్నాలన్నీ ఆర్థిక దౌత్య సంబంధాలను బలోపేతం చేయడంలో కీలక ముందడుగుగా మారుతాయి. వాణిజ్యం, చర్చలను తిరిగి ప్రారంభించడం ద్వారా రెండు దేశాలు ఉద్రిక్తతలను తగ్గించడానికి సహకారాన్ని పెంచుకోవడానికి ఉపయోగపడనున్నాయి. అటు వాణిజ్య బంధంపైనా ఫోకస్ పెడుతున్నాయి. 2023-24లో భారత్‌కు చైనా అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా ఉంది. ద్వైపాక్షిక వాణిజ్యం 118.4 బిలియన్ డాలర్లకు చేరుకుంది. అయితే ఇండియా 85 బిలియన్ డాలర్ల వాణిజ్య లోటును ఎదుర్కొంటోంది. దీనిని తగ్గించేందుకు చైనాలో మన మెడిసిన్స్, అలాగే వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెట్ యాక్సెస్‌ను పెంచాలని భారత్ కోరుతోంది. సో రాబోయే రోజుల్లో అన్నీ జరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా అమెరికాను ఎదుర్కోవడం చైనాకు కీలకం. అందుకు భారత్ సపోర్ట్ కావాలి. అదే సమయంలో మన ప్రాధాన్యతలకు మనకు ఉన్నాయి. అయితే చైనాను పూర్తిగా నమ్మకుండా జాగ్రత్తగా వ్యవహరించడమే కీలకమైన విషయం. ట్రంప్ టారిఫ్‌లతో మారిన కథ. కొన్ని అవకాశాలు ఆటోమేటిక్ గా కలిసి వస్తాయి. ఇప్పుడు భారత్ చైనా సంబంధాల మెరుగువడంలో కూడా చాలానే కలిసి వచ్చాయి. ఈ రెండు దేశాల దౌత్య సంబంధాలకు ఈ ఏప్రిల్ లో 75 ఏళ్లు పూర్తయ్యాయి. ఆ సందర్భంగా చైనా అధ్యక్షుడు, భారత రాష్ట్రపతి పరస్పర అభినందనలు తెలుపుకోవడం దగ్గర్నుంచి ఇప్పుడు స్ట్రాటజిక్ రీ సెట్ దాకా చాలా పరిణామాలు జరుగుతున్నాయ్. రష్యా నుంచి ఆయిల్, ఆయుధాలు కొనడం ఆపకపోతే భారత్ పై 50 శాతం టారిఫ్‌లు వేస్తానని ట్రంప్ ప్రకటించిన తర్వాత కథ మారింది.

ఇది భారత్ అమెరికా సంబంధాలపై చాలా ఎఫెక్ట్ చూపింది. ఓవైపు పాకిస్తాన్ ను అమెరికా దగ్గర తీస్తోంది. ఇటు భారత్ చైనా మధ్య పొలిటికల్ షిఫ్ట్ కనిపిస్తోంది. చైనాపై 20 శాతం సుంకాలు, భారత్ పై 50 శాతం సుంకాలు విధించారు ట్రంప్. దీంతో ఈ రెండు దేశాలు అమెరికా ఆధిపత్యానికి చెక్ పెట్టే దిశగా కదులుతున్నాయి. తాజాగా ప్రధాని మోడీ ఇండిపెండెన్స్ డే స్పీచ్ లోనూ మనం ప్రపంచ మార్కెట్లలో మన సత్తా చాటుకోవాల్సిన టైం వచ్చిందని గుర్తు చేశారు. భారత్ ? చైనా వాణిజ్య సంబంధాల మెరుగుదల. ట్రంప్ అమెరికా ఫస్ట్ అన్న విధానం అలాగే అధిక సుంకాలు భారత్ ? చైనా మధ్య వాణిజ్య సంబంధాలు పెరగడంలో కీలక పాత్ర పోషించింది. సో తమ ఉత్పత్తులకు అమెరికా చెక్ పెడితే.. భారత్ మాత్రం అన్ని ప్రత్యామ్నాయ ఆప్షన్లు చూస్తోంది. అందుకే డైవర్సిఫికేషన్ రూల్ ఫాలో అవుతోంది. ఎక్కడ అవకాశం ఉంటే అక్కడికి ఉత్పత్తుల్ని షిఫ్ట్ చేసే ప్రయత్నాలు ముమ్మరం చేసింది. అందులో భాగంగానే చైనాతో వాణిజ్య బంధంపై ముందడుగు వేస్తోంది. చైనీస్ పెట్టుబడులపై ఆంక్షలను సడలించడం, వాణిజ్య మార్గాలను తెలవడం వంటి చర్యలకు ఓకే చెబుతోంది. క్లియర్ గా చెప్పాలంటే ట్రంప్ విధానాలు భారత్-చైనా సంబంధాలను స్ట్రాటజిక్ రీసెట్ వైపు నడిపిస్తున్నాయి. భారత్ అమెరికాతో బలమైన సంబంధాలను కొనసాగిస్తూనే, చైనాతో ఆర్థిక సహకారాన్ని పెంచడం ద్వారా ప్రపం చంలో తన స్థానాన్ని బలోపేతం చేసుకోవాలని చూస్తోంది. అందుకే ఇవన్నీ జరుగు తున్నాయి. అంతకు ముందు కైలాస శిఖర దర్శన, మానస సరోవర యాత్రకు అడ్డంకులు తొలగించారు.

## వైసీపీ వాళ్లు చెప్పారు...

# టీడీపీ వాళ్లు చేసి చూపించారు

**విజయవాడ - సూర్య వాస్తవం**

పులివెందులలో జెడ్పీ ఎన్నికల్లో ఘోర పరాభవానికి కుప్పంలో లింక్ ఉందా..అప్పటి అత్యుత్సాహమే ఇప్పటి ఓటమికి కారణమైందా అన్నవిశ్లేషణలు వస్తున్నాయి. 2021 స్థానిక ఎన్నికల్లో కుప్పంను కొల్లగొట్టి.. వై నాట్ కుప్పం అంటూ చేసిన అతి చర్యలవల్లే ఇప్పుడు జగన్ పార్టీకి ఈ పరిస్థితి వచ్చిందని తెలుగుదేశం అంటోంది. వై నాట్ 175 అంటూ అప్పట్లో జగన్ కుప్పం ను కూడా కలుపుకునే అన్నారు. దానికి ప్రతిగా చంద్రబాబు వైనాట్ పులివెందుల అంటూ సవాల్ చేశారు.అప్పట్లో జగన్ అయినా.. చంద్రబాబు అయినా కూడా ముఖాముఖీగా వాళ్ల నియోజకవర్గాలను కూడా ఓడిస్తామని సవాల్ చేశారు. అది జరగలేదు కానీ.. ఏడాది తర్వాత పులివెందులలో వైసీపీని టీడీపీ చావు దెబ్బ కొట్టింది. వైఎస్ కుటుంబానికి ఓటమంటే తెలియని పులివెందులలో అదీ ఆ మండలంలో వైసీపీని డిపాజిట్ కూడా రాకుండా ఓడించడం వెనుక చాలా సంగతే ఉంది. క్యాడర్ కష్టపడిందా.. అధికారంతో అక్రమాలు చేసిందా.. ప్రత్యర్థులను భయపెట్టిందా.. లేక జగన్‌పైనే వ్యతిరేకత వచ్చిందా.. ఇలా ఎన్నిరకాల వాదనలున్నా.. సరే మొత్తానికి ఆన్ రికార్డ్ టీడీపీ అక్కడ గెలిచింది. దీనికి కారణం కుప్పం..సాధారణంగా ముఖ్యమంత్రి అభ్యర్థులు పోటీ చేస్తున్న నియోజకవర్గాల్లో ప్రత్యర్థి పార్టీలు అంత దృష్టి పెట్టవ్.. వాళ్లు ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న నేత నియోజకవర్గంలో రాజకీయ ఫిరాయింపులని ప్రోత్సహించడం లాంటివి కూడా చేయరు.. అదంతా వైఎస్ చంద్రబాబు జమానా వరకూ సాగింది. ఆ తర్వాత పరిస్థితులు మారిపోయాయి. 2017లో కడప జిల్లాలో బీటెక్ రవిని స్థానిక సంస్థల కోటాలో ఎమ్మెల్సీగా టీడీపీ గెలిపించుకోగలిగింది. చంద్రబాబు తన జిల్లాలో రాజకీయం చేస్తే.. జగన్ ఏకంగా ఆయన నియోజకవర్గంలోనే చేశారు. 2021 స్థానిక ఎన్నికల్లో కుప్పం మునిసిపాలిటీతో పాటు.. నియోజకవర్గంలోని అన్ని జెడ్పీటీసీలను.. ఎంపీటీ సీలను కూడా వైసీపీ కైవసం చేసుకుంది.పులివెందులో టీడీపీ దౌర్జన్యాలు చేసిందని.. ఓటర్లను బయటకు రాని వ్వకుండా రిగ్గింగ్ చేసుకుందని వైసీపీ ఆరోపిస్తోంది. మరి ఆ రోజు.. కుప్పంలో జరిగింది కూడా అదే. కుప్పం మునిసిపల్ ఎన్నికల్లో టీడీపీ కార్యకర్తలపై దాడులు జరిగాయి. జర్నలిస్టులను కూడా కొట్టారు. ఆ నియోజకవర్గం మొత్తం టీడీపీ బయటకు రాకుండానే చేశారు.కుప్పంలో చంద్రబాబు అప్పటికే 7సార్లు ఎమ్మెల్యే. ప్రత్యర్థి పార్టీకి అంతగా పట్టు లేదు. కానీ 2021లో కుప్పం పరిధిలోని



89 పంచాయతీల్లో వైసీపీ 74చోట్ల గెలిచింది. నియోజకవర్గంలోని 4 మండలాలు వైసీపీ పరం అయ్యాయి. ఇక నాలుగు జెడ్పీటీసీ స్థానాల్లో అయితే.. ఏకంగా 17వేలు, 16వేలు, 11 వేల చొప్పున మెజార్టీలు వచ్చాయి. 68 ఎంపీటీసీ స్థానాల్లో 63 వైసీపీవే..! పెద్దిరెడ్డి కుప్పంలోనే క్యాంప్ వేసి మరీ ఎన్నికల్లో ఈ రిజల్ట్ తెప్పించారు. "చంద్రబాబు ఇలాకాలో 90శాతానికి పైగా సీట్లు అప్పట్లో వైసీపీ తన ఖాతాలో వేసుకుంది. మరిప్పుడు ఒక్క చోట ఓడిపోతేనే గగ్గోలు పెడుతున్నారు ఎందుకు" అంటూ టీడీపీ నేతలు ప్రశ్నిస్తున్నారు. కుప్పంలో గెలుపొందిన వైసీపీ అక్కడితో ఆగలేదు.. చాలా అత్యుత్సాహం ప్రదర్శించింది. చంద్రబాబు ఓడిపోయాడని.. కూలిపోయాడని... ప్రచారం ప్రారంభించింది. జెడ్పీ ఓట్ల లెక్కల ప్రకారం చంద్రబాబు కంటే 62వేల ఓట్లు మెజార్టీ వచ్చిందని చెప్పింది. దీనికి కుప్పం మునిసిపాలిటీమెజార్టీ అదనం.. అది కూడా కలుపుకుంటే 75వేల ఓట్లు మెజార్టీ...వైనాట్ 175 స్లోగన్‌కు అదే బీజం కూడా..! అప్పట్లో నియోజకవర్గం మొత్తం కొల్లగొట్టిన వైసీపీ ఇప్పుడు రెండు జెడ్పీటీసీ ఓటములను జీర్ణించుకోలేక పోయింది. వైసీపీ లెక్క ప్రకారం చంద్రబాబుకు అప్పటికే ఉన్న మెజార్టీని దాటుకుని 75వేలు ఓట్లు పెరిగాయంటే.. దాదాపు లక్ష ఓట్లు టర్న్ అయినట్లు. కానీ 2024 రిజల్ట్ మాత్రం వేరు. చంద్రబాబు తనకు అంతకు మందు వచ్చిన దానికంటే.. 18వేలు పెంచుకున్నారు. మరి ఈ లక్ష ఓట్లు ఏమయ్యాయి. ఇక జగన్ తనకు ఉన్న 90వేల మెజార్టీ నుంచి 60వేలకు పడిపోయారు. దీనిని బట్టే పులివెందులలో జగన్ ప్రాభవం తగ్గినట్లు కనిపిస్తోంది. అప్పట్లో కుప్పం ఒక్కదానితోనే ఆగలేదు.. జిల్లా మొత్తంలో 65 జెడ్పీ స్థానాలుంటే.. 65 వైసీపీనే గెలిచింది. ఇందులో ఏకంగా 33 స్థానాలు ఏకగ్రీవాలయ్యాయి. ఇలాంటి పరిస్థితి ఎంజాయ్ చేసిన వైసీపీ ఇప్పుడు రెండు ఓటములను తీసుకోలేకపోతోంది.కుప్పంలో జరిగిన హంగామాను తెలుగుదేశం చాలా సీరియస్‌గా తీసు కుంది. అందుకే పులివెందులను టార్గెట్ చేసింది. జగన్ నేరుగా ఓడించడం సాధ్యం కాదు అని తెలిసి.. అక్కడ దెబ్బకొట్టడానికి తగిన అవకాశం కోసం చూసింది. మరో ఏడాదిలోనే స్థానిక ఎన్నికలున్నాయి. మామూలు గానే టీడీపీ స్థానిక ఎన్నికలను వేగంగా పెట్టదు. ఇలాంటి పరిస్థితుల్లో ఉపఎన్నిక పెట్టడం.. అది కూడా పులివెందులలో పెట్టడం అంటే ఓ రకంగా రిస్క్ తీసుకున్నట్లు అర్థం. లోకేష్ నేరుగా ఇన్వాల్వ్ అయి... పులివెందుల ఎన్నికకు చొరవ చూపినట్లు తెలుస్తోంది. కచ్చితంగా గెలిచి తీరాలన్న టాస్క్ ఇచ్చిన తర్వాత.. గెలిచి తీరతామన్న నమ్మకంతోనే ముందుకెళ్లారు. జగన్‌ను మొన్నటి ఎన్నికల్లో ఎదుర్కొన్న బీటెక్‌రవి భార్య లతా రెడ్డిని రంగంలోకి దింపారు. గురి చూసి వైఎస్ కుటుంబం కుంభస్థలాన్ని కొట్టారు.కుప్పంలో తెలుగుదేశం నాలుగు చోట్ల కలిపి 20వేల ఓట్లు అయినా సాధించింది. కానీ.. పులివెందులలో వైఎస్సార్సీపీకి డిపాజిట్ రాలేదు. 7వేలకు పైగా ఓట్లు పోలైతే... 683 ఓట్లు మాత్రమే వచ్చాయి. తెలుగుదేశం అసలు ఓటర్లను ఇళ్లనుంచి బయటకు రానివ్వకుండా మొత్తం రిగ్గింగ్ చేసుకుందని వైసీపీ ఆరోపణ. చాలా చోట్ల దొంగ ఓట్లు వేసిన ఆధారాలను ఆ పార్టీ అధినేత బయటపెట్టారు. జమ్మలమడుగు, కమలాపురం, ప్రొద్దుటూరు నుంచి ఓట్లు వేశారని చెప్పారు. ఇవే తరహా ఆరోపణలు కుప్పం ఎలక్షన్‌లోన వచ్చాయి. మేం రిగ్గింగ్ చేసుకుంటే.. "ఓటింగ్ 74శాతమే ఎందుకవుతుంది.. 90శాతం చేసుకునే వాళ్లం కదా.." అని టీడీపీ అంటోంది.తెలుగుదేశం దూకుడుగా వెళ్లినట్లు కనిపిస్తున్నా.. కొన్ని చోట్ల వైసీపీ ఓటర్లు కూడా ఓటింగ్‌కు నిరాసక్తత చూపారు. కొన్నేళ్లుగా నియోజకవర్గంలో వైఎస్ అవినాష్‌రెడ్డి హవానే సాగుతోంది. జగన్ సొంత నియోజకవర్గంపై పెద్దగా దృష్టి సారించడం లేదు. వైఎస్ అవినాష్‌పై కోపం ఉన్న వాళ్లు ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. ఇలా చేస్తే అయినా జగన్‌కు విషయం అర్థం అవుతుంది అనుకున్న వాళ్లు కూడా ఉన్నారు. ఆ వీడియోలు కూడా బయటకు వచ్చాయి. సరే ఏదైతే ఏంటి.. మొత్తానికి మొట్టమొదటి సారి తెలుగుదేశం పులివెందులలో జెండా ఎగరేస్తే.. 45ఏళ్ల తర్వాత వైఎస్ కుటుంబం ఓటమిని ఎదుర్కొంది. వై నాట్ కుప్పం అంటూ ఆరోజు.. చేసిన దానికి వైనాట్ పులివెందుల అంటూ వీళ్లు బదులిచ్చారు.

# టీడీపీది బలమా..బలుపా...

**కడప - సూర్య వాస్తవం**

పులివెందుల జడ్పీటీసీని అధికార టీడీపీ కైవశం చేసుకుంది. ఇది జగన్‌కు ఎదురు దెబ్బ అని వైసీపీ మరింత నీరసించిపోతుందని టీడీపీ శ్రేణులు సంబర పడుతున్నాయి. పులివెందుల గడ్డా ఇకపై జగన్ అడ్డా కాదని వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఇదే సీన్ రిపీట్ అవుతుందని జోస్యం చెబుతున్నాయి. ఇదంతా దొంగ ఓట్లతో సాధించిన విజయమని కచ్చితంగా నిజమైన ఓట్లతో తాము గెలిచి చూపిస్తామని వైసీపీ శపథం చేస్తోంది. ఇంతకీ ఈ విజయాన్ని ఎలా చూడాలి. ఇది టీడీపీ బలానికి ప్రతీకనా లేకా కేవలం వాపేనా అనేది పరిశీలిద్దాం. పులివెందుల అంటేనే వైఎస్ కుటుంబానికి అడ్డా. పార్లమెంట్ ఎన్నికల నుంచి సర్పంచ్ ఎన్నికల వరకు ఆ ఫ్యామిలీయే శాసిస్తుంది. వారు ఎవర్ని నిలబెడితే వాళ్లకే జనం ఓట్లేస్తారు. ఇది అక్కడ ప్రజల ప్రేమాభిమానాలకు నిదర్శనమని వైసీపీ నేతలు చెబుతుంటారు. కానీ అక్కడ ప్రజలకు స్వేచ్ఛ లేకుండా భయపెట్టి ఇలాంటి ప్రొజెక్షన్ ఇస్తుంటారని ప్రత్యర్థుల ఆరోపణ. ఏమైనా సరే ఇప్పటి వరకు వైఎస్ కుటుంబాన్ని దాటి వేరే వ్యక్తులు ఆ ప్రాంతంలో గెలించింది లేదు. అలానే జడ్పీటీసీ కూడా ఆ కుటుంబ ఆధిపత్యం సాగుతూ వచ్చింది. కానీ తొలిసారి ఈ ఉపఎన్నికల్లో టీడీపీ జెండా ఎగరింది. దాదాపు 30 ఏళ్ల తర్వాత పులివెందుల జడ్పీటీసీలో సైకిల్ బెల్ మోగింది. దశాబ్దాలుగా కొనసాగుతున్న వైఎస్ కుటుంబ ఆధిపత్యానికి ఇది ఎదురుదెబ్బే అనొచ్చు. పులివెందుల జడ్పీటీసీగా ఉన్న తుమ్మల మహేశ్వర్‌రెడ్డి 2023లో ఓ ప్రమాదంలో మృతి చెందారు. అందుకే ఈ స్థానం కోసం ఉప ఎన్నిక జరిగింది. అధికారంలో ఉన్న టీడీపీ, అధికారం కోల్పోయిన వైసీపీ రెండు పార్టీలు కూడా ఈ పులివెందల జడ్పీటీసీ ఉపఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. హోరాహోరీగా ప్రచారం చేశాయి. ఒకరిపై ఒకరు తీవ్ర విమర్శలు చేసుకున్నారు. పులివెందుల గడ్డ వైసీపీ అడ్డా అంటూ ఆపార్టీ రాష్ట్ర స్థాయి నేతలంతా వచ్చి ప్రచారం చేశారు. పులివెందుల అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి వ్యూహాన్ని ఈ ఎన్నికల నుంచే



అమలు చేయాలని భావించి టీడీపీ అందుకు తగ్గట్టుగా ప్లాన్ చేసింది. ఈ ఎన్నికల పూర్తి బాధ్యతను ఇద్దరు మంత్రులు, ఇతర సీనియర్ నేతలపై పెట్టింది. నిత్యం వారు పులివెందుల ప్రజల్లోనే ఉంటూ గెలుపు ప్రణాళికలను అమలు చేసారు. జగన్‌కు వ్యతిరేకంగా ఉన్న వర్గాలను చేరదీశారు. వైఎస్ కుటుంబంలోనే జగన్ అంటే పడని వారిని తమవైపు తిప్పుకున్నారు. ఇలా ఆరు నెలలుగా అక్కడ ఆపరేషన్ పులివెందుల చేప ట్టారు. అందుకు తగ్గ ఫలితాన్ని రాబట్టారు. అధికారులను, పోలీసులను విచ్చలవిడిగా పార్టీ కార్యకర్తల మాదిరిగా వాడుకున్న టీడీపీ పులివెందులలో అరాచకంగా ఎన్నికలు నిర్వహించిందని వైసీపీ ఆరోపించింది. నిజమైన ఓటర్లు ఓట్లు వేసుకోలేని విధంగా బూత్ క్యాప్చర్ చేసిందని మండిపడింది. అందుకు తగ్గట్టుగానే కొందరు వ్యక్తులు మీడియాతో మాట్లాడించారు. అటు టీడీపీ కూడా వాళ్లకు కౌంటర్ ఇచ్చింది. దశాబ్దాలుగా ప్రజలను, నాయకులను బెదిరించి ఏకగ్రీవాలు చేసుకుంటూ వచ్చిన వైసీపీ ఇప్పుడు ఎన్నికలు జరుగుతుంటే తట్టుకోలేకపోతోందని మండిపడింది. వైసీపీ అరాచకాలను పోలీసులు అడ్డుకోవడంతో ప్రజలంతా ప్రశాంతంగా వచ్చి ఓటు వేశారని అన్నారు. ఇంకా చాలా మంది రావాల్సి ఉండేదని కానీ వైసీపీ నేతల బెదిరింపులకు భయపడిపోయారని అంటోంది. పులివెందులలో టీడీపీ అరాచకాలు చేస్తోందని ఆరోపిస్తున్న వైసీపీ నేతలకు గతాన్ని గుర్తు చేస్తున్నారు రాజకీయ విశ్లేషకులు. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి ప్రాంతంలో కూడా ప్రత్యర్థులు కనీసం నామినేషన్ వేసే అవకాశం లేకుండా చేశారని చెబుతున్నారు. నాడు వైసీపీ నేతలు చేసింది తక్కువ కాదని చెబుతున్నారు. నాడు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రచారానికి వెళ్లినా కూడా రానివ్వకుండా చేసిన విషయాన్ని మర్చిపోతే ఎలా అని ప్రశ్నిస్తున్నారు. పులి వెందు లలో విజయం సాధించిన టీడీపీ వచ్చే ఎన్నికలలో అసెంబ్లీలో గెలుస్తామని చెప్పడం అతి విశ్వాసం అవుతుంది. ఎందుకంటే గత స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా వైసీపీ ఇలాంటి ప్రయత్నం చేసి బోల్తా పడింది. కుప్పంలో అన్ని లోకల్ బాడీ ఎన్నికల్లో విజయం సాధించింద. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో చంద్రబాబు ఓడిపోతారని ప్రచారం చేసింది. అప్పుడు మంత్రిగా ఉన్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అక్కడే మకాం వేసి చంద్రబాబును దెబ్బతీసేందుకు ప్రయత్నించారు. కానీ అసెంబ్లీ ఎన్నికలు వచ్చేసరికి సీన్ తిరిగబడింది. కుప్పంలో కాదు రాష్ట్రవ్యాప్తంగా వైసీపీని ప్రజలు తిరస్కరించారు. కేవలం 11 సీట్లే కట్టబెట్టారు. ఆ విషయాన్ని టీడీపీ నేతలు గుర్తు పెట్టుకొని మసులుకోవాలని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల జయాపజయాలు కేవలం స్థానికంగా ఉండే రాజకీయ సమీకరణాలను ఆధారంగా చేసుకొని ఉంటాయి. అంతే కాకుండా అధికారంలో ఉన్న పార్టీకి కొద్దోగొప్ప అనుకూలంగా ఉంటాయి. అంత మాత్రాన నాలుగేళ్ల తర్వాత జరగబోయే ఎన్నికల్లో విజయం సాధిస్తామని చెప్పుకోవడం అతి విశ్వాసం అవుతుంది. ఈ దెబ్బకు వైసీపీ ఢీలా పడుతుందని ఆ పార్టీ పని అయిపోయిందనే ఆలోచన సరికాదని అంటున్నారు. గత లోకల్ బాడీ ఎన్నికల్లో కూడా టీడీపీ పని అయిపోయిందని వైసీపీ నేతలు స్టేట్మెంట్‌లు పాస్ చేశారు. ఇప్పుడు వారంతా ఏ పరిస్థితుల్లో ఉన్నారో అందరికీ తెలిసిందే. ఈ విజయం మెట్టుగా ఉపయోగపడుతుంది. అలానే చూడాలని అంటున్నారు.

# జూనియర్ కళాశాలలో 'వనం మనం'



**రాయదుర్గం - సూర్య వాస్తవం ,ఆగస్టు 16:** జాతీయ మానవ హక్కుల.. సీఈవో రామచంద్ర నాయుడు, రాష్ట్ర అధ్యక్షులు బి ఎన్ కృష్ణారెడ్డి ఆదేశాల మేరకు రాయదుర్గం పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో జాతీయ మానవ హక్కుల పరిరక్షణ సంస్థ సభ్యులు రాయలసీమ జోన్ సెక్రెటరీ కావలి ఈశ్వర్, అనంతపురం జిల్లా అడిషనల్ సెక్రెటరీ, కే రాజశేఖర్ రెడ్డి, జోనల్ ఎద్యుకేటివ్ మెంబర్ బి సుధా మోహన్, టౌన్ వైస్ ప్రెసిడెంట్ ఎం రుద్ర, గుమ్మగట్ట మండల అధ్యక్షులు కే లక్ష్మీ కాంత్ రెడ్డి, గుమ్మగట్ట జనరల్ సెక్రెటరీ టి శివ, గుమ్మగట్ట మండల జనరల్ సెక్రెటరీ ఆనంద్ రెడ్డి, టౌన్ ప్రెసిడెంట్ గోవిందు, బొమ్మనహల్ ప్రెసిడెంట్ వై రాముడు, డి రెహల్ ప్రెసిడెంట్ వి మల్లయ్య, రాయదుర్గం తాలూకా ఇంచార్జ్ బి లక్ష్మణ వనం మనం కార్యక్రమాన్ని నిర్వహించారు.

కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాయదుర్గం రూరల్ సీఐ వెంకటరమణ వనం మనం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాయలసీమ జోన్ సెక్రెటరీ కావలి ఈశ్వర్, రాయదుర్గం తాలూకా ఇన్చార్జి బి లక్ష్మణ్, జోనల్, కనేకల్ ప్రెసిడెంట్ బి వెంకటేషులు ఎగ్జిక్యూటివ్ నెంబర్ బి సుధా మోహన్, అనంతపురం జిల్లా అడిషనల్ సెక్రెటరీ కే రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ... సామాజిక కార్యక్రమాలతో పాటు, సామాజిక అసమాన తలను రూపుమాపడానికి జాతీయ మానవ హక్కుల పరిరక్షణ సంస్థ పనిచేయాలని పిలుపునిచ్చారు. మానవ హక్కుల పరిరక్షణ సమితి ఆవిర్భ వించి ఐదు సంవత్సరాల పూర్తి చేసుకున్న సందర్భంగా వనం మనం కార్యక్రమంలో భాగంగా జూనియర్ కాలేజ్ మైదానంలో మొక్కలు నాటడం జరిగిందన్నారు. ప్రజలకు జాతీయ మానవ హక్కుల పరిరక్షణ సంస్థ అందుబాటులో ఉండడంతో పాటు, ప్రజల హక్కులను కాపాడడం కోసం సంస్థ కృషి చేస్తాదన్నారు. ప్రజల హక్కులను వాటిల్లకుండా ప్రజల రక్షణ కొరకై సామాజిక సేవ కొరకై మానవ హక్కుల సంస్థ అందుబాటులో ఉంటుందన్నారు. అనంతరం రూరల్ సీఐ వెంకట రమణ మాట్లాడుతూ... జాతీయ మానవ హక్కుల పరిరక్షణ సంస్థ గత ఐదు సంవత్సరాల నుండి ఎన్నో సేవా కార్యక్రమాలతో పాటు, ప్రజలకు రక్షణ కల్పిస్తూ, ప్రతి కార్యాలయంలో ప్రజా సమస్యలపై జాతీయ మానవ హక్కుల పరిరక్షణ సంస్థ ప్రజల కోసం పరితపిస్తుందని అన్నారు. కార్యక్రమంలో మోడల్ మున్సిపల్ ఉపా ధ్యాయులు వన్నూరు స్వామి, సోషల్ మీడియా చక్రవర్తి, ఉపాధ్యాయులు నీరుకంటి శ్రీనివాసులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు పాల్గొన్నారు.



# సర్దార్ గౌతు లచ్చన్న జీవితం యువతకు స్ఫూర్తిదాయకం

## - జిల్లా కలెక్టర్ టి.ఎస్. చేతన్



**శ్రీ సత్య సాయి బ్యూరో సూర్య వాస్తవం, ఆగస్టు 16:** స్వాతంత్ర్య సమరయోధులు రైతు ఉద్యమ కారకుడు, అణగారిన వర్గాల ఆశాజ్యోతి సర్దార్ గౌతు లచ్చన్న జీవితం యువతకు స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ టి.ఎస్. చేతన్ అన్నారు.శనివారం స్థానిక కలెక్టర్ కార్యాలయం మినీ కాన్ఫరెన్స్ హాలులో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సర్దార్ గౌతు లచ్చన్న 116వ జయంతి కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. స్వాతంత్ర్యోద్యమం, జమీందారీ వ్యతిరేక పోరాటం, హరిజన సేవ, మద్యపాన నిషేధం వంటి రంగాల్లో లచ్చన్న చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. సమాజంలోని పేద, వెనుకబడిన వర్గాల అభ్యున్నతికై ఆయన జీవితాంతం శ్రమించారని గుర్తుచేశారు. ఆయన చూపిన ఆత్మీయత, త్యాగం, పోరాటస్ఫూర్తిని యువత తమ జీవితాలలో ఆచరించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.సర్దార్ గౌతు లచ్చన్న 1909 ఆగస్టు 16న అప్పటి మద్రాస్ ప్రెసిడెన్సీ, శ్రీకాకుళం జిల్లా బారువ గ్రామంలో చిట్టయ్య, రాజమ్మ దంపతులకు జన్మించారు. చిన్ననాటి నుంచే సామాజిక చైతన్యం కలిగి స్వాతంత్ర్యోద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. మహాత్మా గాంధీ నాయకత్వంలో ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమం, ఇతర ప్రధాన పోరాటాలలో పాల్గొన్నాడు. అతను బెర్హంపూర్, రాజమండ్రి జైళ్లలో కఠిన కారాగారవాసంతో పాటు అనేక సార్లు జైలు జీవితం అను భవించాడు. అనేకసార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా సేవలం దించారు. గిరిజన, రైతు, కూలీల హక్కుల కోసం నిరంతర పోరాటం చేసిన యోధుడు అని తెలిపారు.సర్దార్ గౌతు లచ్చన్న 2006 ఏప్రిల్ 19న కన్నుమూశారు. కానీ ఆయన చూపిన మార్గం, చేసిన త్యాగం, సాధించిన విజయాలు ఈ రోజు కూడా సమాజానికి దిశానిర్దేశం చేస్తూనే ఉన్నాయని ..ఆయన చూపిన మార్గంలో విద్యార్థులు, యువత అనుసరిస్తు సమాజ శ్రేయస్సుకు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమానికి ముందుగా.. కలెక్టర్ తదితరులు సర్దార్ గౌతు లచ్చన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి జిల్లా రివెన్యూ అధికారి సూర్యనారాయణ రెడ్డి, బిసి సంక్షేమ శాఖ అధికారి రాజేంద్ర కుమార్ రెడ్డి, ఏపీఎంఐపీ పీడి సుదర్శన్, సమాచార శాఖ సహాయ సంచాలకులు వేణుగోపాల్ రెడ్డి, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# జననేత బండి క్రిష్టప్ప జన్మదిన వేడుకలు

## - భారీగా తరలివచ్చిన.. బండి కిష్టప్ప అభిమానులు



**రాయదుర్గం- సూర్య వాస్తవం, ఆగస్టు 16:** రాయదుర్గం నియోజకవర్గం వాల్మీకి సంక్షేమ సేవా సమితి అధ్యక్షులు నాయకుల బండి క్రిష్టప్ప జన్మదిన వేడుకలను ఆప్తులు, మిత్రులు, బంధువుల మధ్య ఘనంగా జరుపుకున్నారు. శనివారం రాయదుర్గం పట్టణంలోని వాల్మీకి సంక్షేమ సేవా సమితి అధ్యక్షుల స్వగృహంలో ఆ సేవాసమితి ఉపాధ్యక్షులు మలకన్న, న్యాయ సలహాదారులు న్యాయవాది రవిచంద్ర, ప్రధాన సలహాదారులు తలారి రాజప్ప, సభ్యులు అజయ్ టైలర్ రఘు, ట్రాక్టర్ తిప్పేస్వామి, తిప్పేస్వామి, లాలు స్వామి, రుద్ర, మీడియా సలహాదారులు తలారి మల్లయ్య, లక్ష్మీనారాయణ హమాలి యూనియన్ సంఘం సభ్యులు, మిత్రులు ఆయన జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అన్ని సామాజిక వర్గాలకు చెందిన ఆప్తులు పాల్గొని కేక్ కట్ చేసి ఆయన జన్మదిన వేడుక సంబరాలను జరుపుకున్నారు. ఆప్తుడు అయిన ఆయన అన్నా అంటూ ఆయన వద్దకు వచ్చిన వారిని ప్రేమ, అభిమానం, ఆప్యాయత లతో పలుకరిస్తూ సమస్యలను పరిష్కరిస్తూ నేనున్నానంటూ భరోసా కల్పిస్తారని జన్మదిన వేడుకలో పాల్గొన్న వారు ప్రశంసించారు. సహాయార్థం ఆయన వద్దకు వచ్చిన ఏ సామాజిక వర్గం వారినైనా భుజంపైచేయివేసి ప్రేమగా పలకరిస్తూ అధైర పడకండి ఏది ఏమైనా, ఏమి జరిగినా మన మంచికే పొరపాటున కూడా ఇతరులను నిందించడం సరికాదని సర్దిచెప్పిపంపే మహాతపసి కి తాము ఎప్పుడు రుణపడి ఉంటామని ఆయన జన్మదిన వేడుకలో పాల్గొన్నవారు పేర్కొన్నారు. కృష్ణాష్టమి రోజు జన్మించడం ఎంతో మహా భాగ్యమని అందుకే ఆ భగవంతుడు ఆయనకు మంచి సహృదయం కల్పించారని అందుకే ఆయన జననేతగా అందరిచేత ఆయన మన్నానులు పొందుతున్నారని వారు తెలిపారు. రాయదుర్గం నియోజకవర్గంలోని రాయదుర్గం పట్టణం, రాయదుర్గం రూరల్, గుమ్మగట్ట, కణేకల్లు, డి.హిరెహాళ్ మండలాలకు చెందిన వాల్మీకి సంఘం సభ్యులతో పాటు ఆయా సామాజిక వర్గాలకు చెందిన బీసీలు, ఇతర సామాజిక వర్గాలకు చెందిన అనేకమంది ఆయన జన్మదిన వేడుకల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మిత్రులు న్యాయవాదులు సూర్య జాన్సన్, రఘునాయక్, హాలో విశ్రాంతి ఉద్యోగి గొల్ల గోపాల్, చిరు వ్యాపారి గాజుల భీమరాజులు. లక్ష్మీనారాయణ హమాల్ యూనియన్ సంఘం సభ్యులు గొల్ల బండి నాగరాజు, ఆంజనేయులు, దేవేంద్రప్ప, తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.



## శాంతిపురం మండల వడ్డెర సంఘం అధ్యక్షుడిగా ఎం.గంట్లప్ప



**శాంతిపురం- సూర్య వాస్తవం,ఆగస్టు 16** :తెలుగుదేశం పార్టీలో కరుడుగట్టిన కార్యకర్తగా పేరుపొందిన 64 పెద్దూరు గ్రామానికి చెందిన ఎం గంట్లప్ప ను ఆ పార్టీ అధిష్టానం శాంతిపురం మండల వడ్డెర సంఘం అధ్యక్షుడుగా నియమించింది. పార్టీ ఆవిర్భావం నుండి తెలుగుదేశం జెండా మోస్తూ పార్టీకి వెన్నుదన్నుగా ఉంటూ ఎవరు ఎన్ని ప్రలోభాలు పెట్టినా మారకుండా పార్టీ సేవకు అంకితమయ్యారు. ఆయన నిజాయితీని అంకితభావాన్ని గుర్తించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మండల వడ్డెర సంఘం అధ్యక్ష పదవిని కట్టబెట్టారు. ఇదిలా ఉండగా గంట్లప్ప కుప్పం నియోజకవర్గ వడ్డెర సంఘం ఉపాధ్యక్షుడిగా, మండల కో యూనిట్ ఇన్చార్జిగా కొనసాగుతున్న ఎమ్ గంట్లప్పను శాంతిపురం మండల వడ్డెర సంఘం అధ్యక్షుడిగా పార్టీ అధిష్టానం నియమించడంపై పలువురు నేతలు కార్యకర్తలు ఆయనను అభినందించారు. తనపై నమ్మకం ఉంచి తెలుగుదేశం పార్టీ అధిష్టానం తనను శాంతిపురం మండల వడ్డెర సంఘం అధ్యక్షుడిగా నియమించడంపై ఆయన కృతజ్ఞతలు తెలియజేస్తూ తెలుగుదేశం పార్టీ ప్రాభవాన్ని మరింత పెంచి కార్యకర్తలకు అండగా ఉంటూ కష్టపడి పని చేస్తానని గంట్లప్ప మీడియాకు తెలిపారు.

## మదనపల్లిలో వ్యక్తి దారుణ హత్య..?

**- చంపి రైల్ ట్రాక్ వద్ద పడేసి ఆత్మహత్యగా చిత్రీకరణ..**

**- హత్యకు గురైన వ్యక్తి ఆచూకీ లభించకపోవడంతో తలలు పట్టుకుంటున్న పోలీసులు..**

**- రంగంలోకి దిగిన మదనపల్లె తాలూకా, కదిరి రైల్వే పోలీసులు..**



**మదనపల్లె - సూర్య వాస్తవం ,ఆగస్టు 16:** మదనపల్లె మండలంలో గుర్తు తెలియని వ్యక్తి దారుణ హత్యకు గురైయ్యాడు. శనివారం ఉదయం 6.30 గంటలకు హత్య వెలుగు చూసిన తీవ్ర కలకలం రేపుతోంది. ఈ విషాదకర ఘటనకు సంబంధించి స్థానికులు, తాలూకా పోలీసుల కథనం. అన్నమయ్య జిల్లా, మదనపల్లి మండలం, చిన్నతిప్ప సముద్రం గ్రామం, రైల్వే స్టేషన్ కి అనుకుని ఉన్న రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి పైన అర్ధరాత్రి ఓ గుర్తు తెలియని వ్యక్తి దారుణ హత్యకు గురైయ్యాడు. కాళ్లు చేతులు కట్టేసి అతి కిరాతకంగా హత్య చేసి మృతదేహాన్ని తీసుకొచ్చి రైలు పట్టాలకు సమీపంలో పడేసి వెళ్లారు. అర్ధనగ్నం చేసి, కాళ్లు చేతులు కట్టేసి దారుణంగా చంపేశారు. ముంచేతులు కమిలిపోయి, రక్త గాయాలు ఉండడం, శరీరంపై కర్రలు ఇనుపరాలతో కొట్టినట్లు వాతలు పడి కమిలి ఉండడం చూస్తుంటే ఎవరో పథకం ప్రకారం హత్య చేసి మృతదేహాన్ని తీసుకొచ్చి రైలు పట్టాల వద్ద పడేసి ఆత్మహత్యగా చిత్రీకరించి నట్లు తెలుస్తోంది. మదనపల్లె తాలూకా పోలీసు అనుమాన స్పద మృతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కళా వెంకటరమణ తెలిపారు.

## ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు





**పామిడి- సూర్య వాస్తవం, ఆగస్టు 16 :** పామిడి పట్టణంలో ప్రబోధ సేవసమితి, ఇందుజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కొత్త బస్టాండ్ దగ్గర ఏర్పాటు చేసిన కుటిరంలో కృష్ణుని ప్రతిమ ఏర్పాటు చేసి పూజలు చేసారు. అన్నదానం చేశారు. తరువాత "ఊరు ఎరిగింపు "కార్యక్రమం నిర్వహించారు. బాలలకు యశోద, కృష్ణ అలంకరణ తో తీర్చి దిద్ది కృష్ణుని విగ్రహం ముందు నృత్యం చేస్తూ మేళా తాలలతో ఊరేగింపు జరిపారు. అడుగడున భక్తులు స్వామి వారికీ పూవులు సమర్పించారు. త్రయిత సిద్ధాంతం ప్రకారం నిర్వహించారు. సంఘం అధ్యక్షులు సూర్యనారాయణ, చంద్రశేఖర్ ఆధ్వర్యంలో కార్యక్రమం చేసారు.

## సంస్కృతి సాంప్రదాయాల సమాహారం శిల్పారామం

**అనంతపురం క్రైం - సూర్య వాస్తవం, ఆగస్టు 16:** అనంతపురం పట్టణంలోని స్థానిక శిల్పారామంలో కృష్ణాష్టమి పండుగ ను శనివారం నాడు సాయంత్రం 05:30 గంటల నుండి 06 గంటల వరకు డిస్కవర్ అనంతపురం, గ్రీన్ ఆర్మీ అనంతపురం మరియు శక్తి శారీస్, అనంతపురం వారి సహకారంతో కృష్ణుడి బాల్యాన్ని గుర్తుచేసుకుంటూ, ఉట్టిని కొట్టి పగలగొట్టే సంప్రదాయ కార్యక్రమం మరియు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా అమృత కూచిపూడి నృత్య కళా నిలయం, నృత్య గురువు శ్రీమతి తరుణి వారి బృందంచే సాంస్కృతిక కార్యక్రమాలు (శాస్త్రీయ, సినీ, జానపదం నృత్యములు) నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాకారులు జోషిక, ఒజశ్విని, మౌనిక్ష్ణనస, భవ్య, రుత్విక, ఋత్విజ తదితరులు పాల్గొన్నారు.






# అనంతపురం ఏఆర్ ఎస్ఐ నాగేంద్రకు సేవా పతకం



**అనంతపురం క్రైం - సూర్య వాస్తవం, ఆగస్టు 16:** అనంతపురం ఏఆర్ ఎస్.ఐ కురుబ నాగేంద్రకు సేవా పతకం లభించింది. కళ్యాణదుర్గం మండలం మల్లాపురం గ్రామానికి చెందిన నాగేంద్ర 1990వ సంవత్సరంలో కానిస్టేబుల్‌గా చేరారు. అప్పటి నుంచి విధి నిర్వహణలో ఆయన క్రమ శిక్షణతో సేవలందిస్తూ, హెడ్ కానిస్టేబుల్‌గా, ఏఆర్ ఎస్.ఐ హోదాలో ఇప్పుడు పని చేస్తున్నారు. తన 36 ఏళ్ల సర్వీసులో ఆయన ఇప్పటి వరకు ఎన్నో అవార్డులు, క్యాష్ రివార్డులు అందుకున్నారు. తాజాగా నాగేంద్రకు సేవా పతకాన్ని రెండు నెలల కిందట రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. అనంతపురం పోలీస్ ట్రైనింగ్ కాలేజ్ వైస్ ప్రిన్సిపల్ వాసుదేవన్ చేతుల మీదుగా ఆయన సేవా పతకాన్ని అందుకున్నారు. నాగేంద్రకు పోలీస్ శాఖ ఉద్యోగులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

## ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

### - నేతాజీకి నివాళులర్పించిన మాజీ సైనికులు



**కుప్పం -సూర్య వాస్తవం, ఆగస్టు 16 :** 79 వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు ఈసందర్భంగా కుప్పం పట్టణంలోని పార్కు వద్ద ఉన్న నేతాజీ విగ్రహానికి మాజీ సైనికులు పూలమాలవేసి ఘనంగా నివాళుల ర్పించారు.ఈ కార్యక్రమంలో మాజీ సైనిక సంక్షేమ సంఘం కుప్పం అధ్యక్షులు రవి, సభ్యులు కెంచప్ప, రామ చంద్ర, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## గుత్తి మార్కెట్ యార్డ్ డైరెక్టర్‌గా మిద్దె ఓబులేష్



**గుత్తి -సూర్య వాస్తవం, ఆగస్టు 16:** గుత్తి పట్టణంలోని మార్కెట్ యార్డు డైరెక్టర్గా జనసేన పా ర్టీకి చెందిన మం డల కార్య దర్శి మీద్దె ఓబులేసు ఎంపి క చేసినందుకు కృతజ్ఞతలు తెలుపు తూ ఈ సందర్భంగా మిద్దె ఓబులేసు మాట్లాడుతూ ఈ పదవికి ఎంపిక చే సినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్య మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్,గుం తకల్లు నియోజకవర్గం కూటమి శాసన సభ్యులు గుమ్మనూరు జయరాం కి గుంతకల్లు నియోజకవర్గం జనసేన పా ర్టీ సమన్వయకర్త వాసగిరి మణికంఠ కి గుత్తి పామిడి టీడీపీ ఇంచార్జ్ గుమ్మ నూరు ఈశ్వర్కి గుత్తి మార్కెట్ యార్డ్ చైర్మన్ జక్కలచెరువు ప్రతాప్ కి నా హృదయపూర్వక కృతజ్ఞతలు.

## ఆర్థిక మంత్రి, కలెక్టర్ చేతుల మీదుగా 3వ అవార్డు అందుకున్న వైద్య ఆరోగ్య శాఖ



**అనంతపురం -సూర్య వాస్తవం, ఆగస్టు 16:** అనంతపురం 79 వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా స్థానిక పెరడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైద్య శాఖ ఏర్పా టు చేసిన శకటంకు మూడవ అ వార్డు లభించింది.ఈ అవార్డును జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఈ బి దేవి, డెమో త్యాగరాజు,గంగాధర్ డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేటర్స్ వేణుగోపాల్ విజయ భాస్కర్, కిరణ్ కుమార్ వెంకటేష్ అందుకున్నారు.శకటం ద్వారా పట్టణ,గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు అందించే వైద్య సేవలు గూర్చిఅవగాహన కల్పించారు.

## ఉత్తమ వైద్యాధికారిగా ప్రశంసా పత్రం అందుకున్న త్రివేణి



**గుత్తి -సూర్య వాస్తవం, ఆగస్టు 16:** గుత్తి 79వ స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా స్థానిక పెరేడ్ గ్రౌండ్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మారుమూల ప్రాంతాలకు వైద్య సేవలు అందించి నందుకు గాను, కృష్ణపాడు వైద్యాధికారి డాక్టర్ త్రివేణికి ఆర్థిక మంత్రి పయ్యావు ల కేశవ్,జిల్లా ఇన్చార్జి కలెక్టర్ శివ నారాయణ శర్మ,ఎస్పీ జగదీష్,డి ఆర్ ఓ,మలోల,డిఎం హెచ్‌ఓ,డా క్టర్,ఈ,బి దేవి హాజరై వారి చేతు ల మీదుగా ప్రశంసా పత్రాలను అందజేసి సత్కరించారు,అదేవి ధంగా డిఎం హెచ్ ఓ డాక్టర్ ఈ బి దేవి చేతులు మీదుగా ఉత్తమ ఏ ఎన్ఎం జ్యోతికి ప్రశంసా పత్రం అందజేశారు,

# వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు

**- కృష్ణాష్టమి వేడుకల్లో ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు**

**- కృష్ణుని రథం ఊరేగింపుకు భారీగా తరలివచ్చిన యాదవ కులస్తులు**



**రాయదుర్గం- సూర్య వాస్తవం, ఆగస్టు 16:** రాయదుర్గం పట్టణంలోని యాదవ కులస్తులుశ్రీ కృష్ణాష్టమి పండుగను ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాయదుర్గం ఎమ్మెల్యే కాలువ శ్రీని వాసులు పాల్గొన్నారు. గీతాసారం సదా అను సరణీయమని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. రాయదుర్గం పట్టణంలోని సంతాన వేణుగోపాల స్వామి ఆలయ కమిటీ శనివారం నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు సాధన స్వాగతం పలికారు. స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఈ సందర్భంగా ఊరేగించారు. రథోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే కృష్ణుడి బోధనల సారాన్ని ప్రతి ఒక్కరు



అవగాహన చేసుకోవాలన్నారు. ధర్మ సంస్థాపన కోసం ఆయన సాగించిన లీలలు అనేక మన్నారు. కృష్ణాష్టమి సందర్భంగా ఆయన చూపిన ధర్మ మార్గంలో నడవడానికి అందరూ ముందుకు రావాలన్నారు.

**మురుడి అంజన్నకు ప్రత్యేక పూజలు :** శ్రావణ మాసం నాలుగో శనివారం సందర్భంగా ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు మురడి ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులతో కలిసి స్వామివారికి ప్రత్యేక పూజలు చేయి ంచారు. కాలవన్నకు ఆలయ పూజారులు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా బళ్ళారి గాదిలింగప్ప ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

# అధ్వానంగా మార్కెట్‌లోని రోడ్లు

**- దుర్గంధపూరితంగా నగర మార్కెట్లు**





**అనంతపురం క్రైం - సూర్య వాస్తవం, ఆగస్టు 16:** అనంతపురం పాతూరు, కొత్తూరు మార్కెట్, గుత్తి రోడ్డులోని మార్కెట్ యార్డ్ ప్రతి రోజు రెండు లక్షల మందికి కాయగూరలు, పండ్లు సరఫరా అవ ు తున్నాయి. మార్కెట్‌లో కాయగూరలు పండ్లు నిల్వ చేసే ప్రదేశాలను, కమిషన్ ఏజంట్ల ప్రదేశాలను చూసిన ట్లయితే అన్నం సహించదు. మార్కెట్లు దుర్గంధ పూరితంగా ఉన్నాయి. మార్కెట్ యార్డ్ ఒకవైపు డంపింగ్ యార్డ్ నుంచి వచ్చే విషవాయువు, మరోవైపు దుర్గంధం, నడవడానికి కూడా సాహసం చేయలేని బహిరంగ మల మూత్ర విసర్జన చేసి విపరీతమైన దుర్గంధం వెదజల్లుతుంటుంది. శనివారం పశువుల సంత తరువాత ఎక్కడి పెండ అక్కడ, గడ్డి, పంట వ్యర్థాలను తొలగించే నాథుడే కరువయ్యాడు. వ్యక్తిగత పరిశుభ్రత, ప్రజా ఆరోగ్య వ్యవస్థను పటిష్ట పర్చడం, రోగాలు ప్రబలకుండా నివారణకు ప్రభుత్వం ప్రథమ కర్తవ్యంగా భావించాలి. మనుషులకు సుఖవిరోచనం లేదా ఏదైనా సరిపడని నూనె వాడిన పదార్థాలు తిన్నప్పుడు విరేచనాలు, లేదా ప్రయాణ సమయాల్లో విరేచనాలు సహజం.

చాలా నగరాల్లో మార్కెట్లుకు కాయగూరలు, పండ్లు, నిత్యావసర సరుకులు గ్రామీణ ప్రాంతాల నుండి లేక సుదూర ప్రాంతాల నుంచి లారీలు, ట్రక్కులు డ్రైవర్లు, హమాలీలు, రైతులకు ఎక్కడ మరుగుదొడ్లు ఉండవు. మరుగుదొడ్లు లేక మార్కెట్లు సమీప ప్రాంతాల్లో మలమూత్ర విసర్జన షాపుల ముందు, నివాస ప్రాంతాల్లో , సెల్లార్లు, మిద్దెల పైన ఎక్కడ పడితే అక్కడ దుర్గంధ పూరితమై ఉంటుంది. పబ్లిక్ టాయిలెట్స్ ఉన్న నిర్వహణ లేక భయంకరంగా ఉంటుంది. లోపలికి వెళితే నరకంలో ఉన్నట్టుంటుంది, బీడీ సిగరెట్ పీకలు, పాన్ బిడాల, గుట్కాలు గోడలపైన, నేలపై ఉమ్మివేయడం సర్వసాధారణ విషయం, గంద్ర చీమలు మట్టి తోడడం, చిలుము పట్టిన బకెట్లు, కింద పడేసిన ముగ్గులు, గొళ్ళాలు లేని రేకు తలుపులు సర్వసాధారణం. ఇక్కడ పబ్లిక్ టాయిలెట్ ఉందని బోర్డు పెట్టనవసరం లేకుండా ఫర్లాంగు దూరం వరకు దుర్గంధం వెదజల్లుతుంటుంది. ఈ రోత భరించలేక పురుషులు చాలా మంది గుట్టు చప్పుడు కాకుండా పబ్లిక్ స్థలాలలో మరుగు చూసుకొని మార్కెట్లోనే పని కానిస్తున్నారు. గత్యంతరం లేక చాటు దొరికితే చాలు కళ్లు మూసుకొని గబ్బుపట్టిస్తున్నారు. ఇక మహిళల సంగతి ఆ దేవుడికెరుక, ఆ సమయంలో మహిళలు సిగ్గుతో తల వంచు కొని వెళ్లాల్సిన పరిస్థితి దాపురించింది. నగరలలోని వ్యాపార, వాణిజ్య సముదాయాల్లోనూ చాలా వాటికి మరుగుదొడ్లు కనిపించడం లేదు. మున్సిపల్ నిబంధనల ప్రకారం ప్రతి అంతస్తుకు సామూహిక మూత్రశాల ఉండాలి. అలా ఉంటేనే అనుమతులు ఇస్తారు. కానీ టౌన్ ప్లానింగ్ అధికారులు మాత్రం అవేమీ పట్టించుకోకుండా అనుమతులు ఇచ్చేస్తున్నారు.

రహదారుల్లో అక్కడక్కడ, రైల్వేస్టేషన్లు, బస్ స్టేషన్లు, కూరగాయల, పండ్ల, మటన్, చికెన్, చేపల మార్కెట్‌లలో పరిస్థితులు చాల అధ్వానంగా తయారయ్యాయి. స్వచ్ఛ భారత్‌లో భాగంగా చాల నగరాలు ఓడీఎఫ్ ప్లస్ ప్లస్ సాధించినా, బహిరంగ మూత్ర విసర్జనను నివారించాల్సిన అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. సులభ్ కాంప్లెక్స్ లు మరీ అధ్వాన్నంగా ఉంటున్నాయి. స్వచ్ఛ భారత్ సెస్ ఎందుకు వసూలు చేస్తున్నారో, నిధులు ఎక్కడ ఖర్చు చేస్తున్నారో తెలియని పరిస్థితి, కేవలం నినాదాలకే పరిమితమై ఆచరణలో శూన్యం గా వ్యవహరిస్తున్నది ప్రభుత్వం. రహదారి రవాణా రంగం దేశ ప్రగతికి అత్యంత ముఖ్యమైనది, రవాణా మౌలిక సదుపాయాలు దేశం యొక్క పురోగతికి వేగం మరియు సామర్థ్యాన్ని పెంచుతుంది. వస్తువులను రవాణా చేయడం మరియు పంపిణీ చేయడంలో నగరాల్లో నడుస్తున్న స్థానిక రవాణా కీలక పాత్ర పోషిస్తుంది. భారతదేశంలో వ్యవసాయం తర్వాత ఎక్కువ మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడి జీవిస్తున్న రంగం రవాణా రంగం, అంతటి ప్రాధాన్యత కలిగిన రవాణా రంగానికి ప్రభుత్వం చేయూతనివ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వ్యవస్థలో రవాణా రంగం అతి కీలకమని గుర్తించి ప్రభుత్వం తోడ్పాటు ఇచ్చినట్లయితే ఈ రంగంపై ఆధారపడి జీవిస్తున్న ప్రజలు ప్రభుత్వానికి రుణపడి ఉంటారు. గత నాలుగు సంవత్సరాలుగా డీజిల్ పెట్రోల్ ధరలు డెబ్బై శాతం, టోల్ సెస్ విపరీతంగా పెరగడంతో రవాణా రంగానికి గడ్డుకాలం ఏర్పడింది. మరోవైపు రవాణ, పోలీసు అధికారులు వేస్తున్న ఫైన్లు, చలాన్లు బాణాలై గుచ్చుకుంటున్నాయి. ఫైనాన్స్ కంపెనీలు పెనాల్టీలు, అధిక వడ్డీల రూపంలో జలగలై రక్తం జుర్రేస్తున్నాయి.

ప్రభుత్వం పెంచిన పెట్రోలు, డీజిల్ ధరలు ఆగిన మూడు చక్రాల బతుకు బండిని చూసి వెక్కిరిస్తున్నాయి. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన రవాణా కార్మికులకు సరైన తిండి నీరు సదుపాయాలు లేవు. చిన్న హోటల్స్ ఉన్నా అపరిశుభ్రత వాతావరణంలో, కనీసం చేతులు కడుక్కోవడానికి నీరు ఉండదు. మార్కెట్లను ఆధునీకరించి, ప్రజలకు అందుబాటు లోకి తీసుకురావాలి, పార్కింగ్ వసతి, తాగునీటి వసతి ప్రభుత్వం కల్పించాలి. రోజూ రెండు సార్లు చెత్త సేకరణ జరగాలి, అలాగే దుర్గంధ పూరిత ప్రదేశాలలో డిడిటి, బ్లీచింగ్ పౌడర్, ఫినల్ పిచికారీ చేయించాలి. రైతులకు రవాణా కార్మికులకు చిన్న వర్తకులకు క్యాంటిన్ సౌకర్యం కల్పించి మెరుగైన వస తులు కల్పించాలనీ నిర్వాసితుల సంక్షేమ సంఘం అధ్యక్షులు, డా. యం. సురేష్ బాబు కోరారు

### శ్రావణమాసం నాలుగో వారం

# దేవాలయాలకు పోటెత్తిన భక్తులు





**చెన్నూరు-సూర్య వాస్తవం, ఆగస్టు, 16:** చెన్నూరు మండల వ్యాప్తంగా శ్రావణమాసం నాలుగవ శనివారం కావడంతో ప్రధాన ఆలయాలు భక్తులతో పోటెత్తారు. చెన్నూరు బ్రాహ్మణ వీధిలో వెలసిన శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో తెల్లవారుజామున వేద పండితులచే ప్రత్యేక అభిషేక పూజలు పూల అలంకరణ నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆంజనేయ స్వామి క్యూ కట్టారు. కమిటీ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. చెన్నూరు ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో మూలవిరాట్ వెంకటేశ్వర స్వామికి తెల్లవారు జామున ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రక్కన ఉన్న ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు పూలు అలంకరణ నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. చెన్నూరు సమీపంలోని బుడ్డాయిపల్లి హైవే రోడ్డు ప్రక్కన వెలసిన శ్రీ ఆంజనేయ స్వామికి ప్రత్యేక అభిషేక పూజలు పూల అలంకరణ నిర్వహించారు. చెన్నూరు హైవే రోడ్డు సమీపంలో పెన్నా నది ఒడ్డున వెలసిన పెన్నా ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కనుపర్తి. రామనపల్లి వివిధ గ్రామాల్లో వెలసిన ఆంజనేయ స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# అట్ల కృష్ణారావు జన్మదిన వేడుకల్లో ఏఎంసీ ఛైర్మన్

**నాయుడుపేట -సూర్య వాస్తవం, ఆగస్టు 16:** జనసేన పార్టీ నేత అట్ల కృష్ణారావు జన్మదిన వేడుకలు శనివారం నాయుడుపేట పట్టణంలోని మేరీ అనాధ వృద్ధాశ్రమంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా అట్ల కృష్ణారావు మేరీ అనాధ వృద్ధాశ్రమంలో కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అనంతరం వృద్ధాశ్రమంలోని వృద్ధులకు నిత్యవసర వస్తువులు,దుస్తులు తోపాటు రూ.5000 నగదును ఆశ్రమ నిర్వాహకులు సునీత బెన్నీకి అందజేశారు.ఈ సందర్భంగా జనసేన పార్టీ సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్చార్జ్, నాయుడుపేట ఏఎంసి చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్ అట్ల కృష్ణారావుకు శాలవాకప్పి, సన్మానించి,జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం ఉయ్యాల ప్రవీణ్ మాట్లాడుతూ జనసేన పార్టీ నేత అట్ల కృష్ణారావు తన జన్మదిన వేడుకలు అనాధ వృద్ధాశ్రమంలో నిర్వహించడం,




వృద్ధులకు చేయూతనందిస్తూ నిత్యవసర వస్తువులు, దుస్తులు, రూ.5000 నగదు అందజేయడం అభినందనీయమని కొనియాడారు.అనంతరం ఆశ్రమ నిర్వాహకులు సునీత బెన్నీ జనసేన పార్టీ నేతలు ఉయ్యాల ప్రవీణ్ అట్ల కృష్ణారావు లకు శాలవాలు కప్పి,సన్మానించి, కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నేతలు గిండి సతీష్,బాలుశెట్టి శేఖర్,శీను,కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

# అంత అన్నారు... ఇంత అన్నారే...

**కడప -సూర్య వాస్తవం:** జనసేన అధినేత పవన్ కల్యాణ్ కడప జిల్లాలో క్యాంప్ కార్యాలయం పెడతానని దాదాపు కొన్ని నెలలు గడుస్తుంది. అయితే ఇప్పటి వరకూ కడప జిల్లాలో క్యాంప్ కార్యాలయం పెట్టింది లేదు. ఆయన వెళ్లింది లేదు. ఈ ఏడాది జనవరిలో ఆయన కడపలో పర్యటించిన సందర్భంగా చేసిన ప్రకటన ప్రకటనకే పరిమితమయినట్లుగా కనపడుతుంది. దాదాపు తొమ్మిది నెలలు గడుస్తున్నా కడపలో క్యాంప్ కార్యాలయం పెట్టలేదు. పవన్ కల్యాణ్ ఆ ఊసే మర్చిపోయినట్లుంది. తాను ప్రజల్లోకి వెళ్లి బహిరంగంగా చేసిన ప్రకటనను కూడా పట్టించుకోకపోవడం ఇప్పుడు రాజకీయంగా చర్చనీయాంశమయింది. కడప ప్రాంతంలో పర్యటించినప్పుడు ఉండే జోష్ తర్వాత పవన్ కల్యాణ్ లో ఎందుకు కనిపించడం లేదన్న ప్రశ్నకు మాత్రం జవాబు లేదు. మాటకు కట్టుబడి ఉండేలా... అన్నమయ్య జిల్లాలోని గాలివీడు తహాశీల్దారును పరామర్శించడానికి కడప వెళ్లిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఊరమాస్ వార్నింగ్ ఇచ్చారు. అయితే తర్వాత మాత్రం ఆ మాస్ వార్నింగ్ ను కడప సరిహద్దుల్లోనే వదిలేసినట్లుందని సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. పవన్ కల్యాణ్ ఏదైనా ఆ సమయంలో చెప్పిన మాటకు కట్టుబడి ఉండరని, అక్కడ పరిస్థితులను బట్టి తన మనసులో తోచిన విషయాన్ని ఆవేశంగా బయటకు చెబుతారని, అంతే తప్ప ఆచరణ సాధ్యం కాని విషయాలను కూడా చెప్పి జనం ముందు నవ్వుల పాలు అవుతున్నారని జనసైనికులే అంటున్నారు. అందుకే ఒక మాట చెప్పేముందు అన్నీ ఆలోచించుకుని చేయాల్సి ఉంటుందన్న కామెంట్స్ వినపడుతున్నాయి. గతంలోనూ పవన్ కల్యాణ్ చేసిన అనేక వ్యాఖ్యలు, హామీలను కూడా వైసీపీ సోషల్ మీడియాలో పోస్టు చేస్తున్నారు. పవన్ కల్యాణ్ మాటలపై నమ్మకం కలగాలంటే కనీసం తాను చెప్పిన మాటలను అయినా నిజం చేయాలని, కనీసం కడపలో క్యాంప్ కార్యాలయం ఏర్పాటు చేయడానికి ఉన్న అభ్యంతరాలేమిటి? అని జనసైనికులే ప్రశ్నిస్తున్నారు. అందుకే పవన్ కల్యణ్ ఇకపై ఒక మాట మాట్లాడేటప్పుడు ఆచరణ సాధ్యమా? తన కున్న పరిధిలో అది వీలవుతుందా? అన్నది ఆలోచించు కోవాలంటున్నారు. రాయలసీమలో పవన్ కల్యాణ్ పార్టీని బలోపేతం చేసే ప్రయత్నం ఇంతవరకూ మొదలు పెట్టకపోవడంపై కూడా జనసైనికుల్లో అసంతృప్తి కనపడుతుంది. మరి పవన్ ఇప్పటికైనా సీమలో నిలదొక్కుకునే ప్రయత్నం చేస్తారా? లేదా? అన్నది చూడాలి.

# ఉపరాష్ట్రపతి ఎన్నికపై ఎన్డీయే భేటీ

**న్యూఢిల్లీ --సూర్య వాస్తవం:** పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో చోటుచేసుకున్న అనూహ్య పరిణామంతో దేశంలో ఒక్కసారిగా రాజకీయ వాతావరణం మారి పోయింది. ఉపరాష్ట్రపతి పదవికి జగ్‌దీప్ ధన్కడ్ రాజీనామా దేశంలో సరికొత్త చర్చకు దారితీసింది. ఈలోగా ఉప రాష్ట్రపతి ఎన్నికకు కేంద్ర ఎన్నికల సంఘం తేదీలు ఖరారు చేయడంతో భారత చరిత్రలో ఇది రెండవ మధ్యంతర ఉపరాష్ట్రపతి ఎన్నికగా నిలుస్తుంది. ఇప్పుడు కాబోయే ఉపరాష్ట్రపతి ఎవరు అన్న అంశంపైనే విస్తృత చర్చ జరుగుతోంది. ప్రస్తుత సంఖ్యాబలం ప్రకారం అధికార నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ కూటమికి చెందిన అభ్యర్థే గెలుపొందే అవకాశాలు ఉన్నందున.. ఆ కూటమిలో జరుగుతున్న కసరత్తు ఆసక్తికరంగా మారింది. తాజాగా జరిగిన ఎన్డీఏ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ఇదే అంశంపై చర్చించి.. నిర్ణయాధికారాన్ని కూటమి పెద్దన్న భారతీయ జనతా పార్టీ అగ్రనాయకత్వానికే అప్పగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, బీజేపీ జాతీయాధ్యక్షుడు జేపీ నడ్డాకు ఈ నిర్ణయాధికారాన్ని కట్టబెడుతూ తీర్మానం కూడా చేశారు. అంటే పార్లమెంట్ ఉభయసభల్లో సభా నాయకులుగా ఉన్న ఈ ఇద్దరు ప్రభుత్వ శాసన వ్యూహాల్లో కీలక పాత్ర పోషిస్తున్నందున భారత ఉపరాష్ట్రపతి పదవికి ఎన్డీఏ అభ్యర్థిని ఎన్నుకునే అధికారాన్ని కట్టబెట్టారు. అయితే బీజేపీలోని అత్యుతన్న నిర్ణయాత్మక విభాగం (బీజేపీ పార్లమెంటరీ బోర్డు) ఉపరాష్ట్రపతి అభ్యర్థిని ఎంపిక చేయడం కోసం ఈ నెల 17న సాయంత్రం గం. 6.00కు సమావేశం కానుంది. ఈ నేపథ్యంలో ఉపరాష్ట్రపతి రేసులో ఎవరున్నారన్న చర్చ ఊపందుకుంది.ఉపరాష్ట్రపతి ఎన్నిక పార్లమెంట్ ఉభయ సభల ఎంపీలు కలిసి ఓటు వేసే అరుదైన సందర్భాలలో ఒకటిగా నిలుస్తుంది. సెప్టెంబర్ 9న జరగనున్న ఈ ఎన్నిక జరగనుంది. ఇటువంటి ఎన్నిక్లో పార్టీల సంఖ్యాబలాలు ముఖ్యమైనవి. కానీ ప్రస్తుత పరిస్థితిలో ఎన్డీఏకు అత్యంత సౌకర్యవంతమైన ఆధిక్యం ఉంది. ఈ పరిస్థితుల్లో అధికార కూటమికి గెలుపు వ్యూహాలను పదనుపెట్టి సంఖ్యాబలాన్ని కూడగట్టాల్సిన అవసరం లేదు. కానీ ఉపరాష్ట్రపతి అభ్యర్థిని ఎంపిక చేసే విషయంలో ఒక రాజకీయ సందేశాన్ని పంపాల్సి ఉంటుంది. ప్రాంతం, కులం, భావజాల మూలాలు, కూటమి లెక్కలను సమన్వయం చేయడంతో పాటు ఇంకా అనేక సమీకరణాలను బేరీజు వేసుకోవాల్సి ఉంటుంది.పార్లమెంటులో ఎన్డీఏ సంఖ్యాబలాన్ని ఒకసారి పరిశీలిస్తే.. రాజ్యసభలో బీజేపీకి 102 సీట్లు ఉండగా మిత్రపక్షాలైన జేడీ(యూ), ఏఐఏడీఎంకే, తెలుగుదేశం, ఎన్పీఎఫ్ మరియు ఇతర మిత్రపక్షాలతో కలిసి మొత్తం 239 సీట్లలో ఎన్డీయే బలాన్ని 132 సీట్లకు చేరింది. రాజ్యసభలో ఏడుగురు నామినేటెడ్ సభ్యులు కూడా ఓటు వేయడానికి అర్హులు. సాధారణ పరిస్థితుల్లో నామినేటెడ్ ఎంపీలు అధికారక కూటమికే మొగ్గు చూపుతుంటారు. ఈ సంఖ్యను కూడా కలుపుకుంటే అధికార కూటమి



సంఖ్య 139కు చేరుతుంది. మిగతా సభ్యుల్లో అటు అధికార, ఇటు ప్రతిపక్ష కూటముల్లో లేని తటస్థ రాజకీయ పార్టీలకు చెందిన పార్టీల నేతలు కూడా ఉన్నారు. వారిలో కొందరు అధికార కూటమికి మద్దతు పలికే అవకాశాలు సైతం లేకపోలేదు.ఇక లోకసభలో బీజేపీకి 240 మంది సభ్యులు, మిత్రపక్షాల 53 సీట్లతో కలిపి మొత్తం 542 మందిలో ఎన్డీయే బలం 293కు చేరుతుంది. రెండు సభలు కలిసి ఓటు వేసినప్పుడు, విజయానికి అవసరమైన సింపుల్ మెజారిటీని ఎన్డీయే సులభంగా అధిగమిస్తుంది.

కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండికూటమిలో కాంగ్రెస్ నుంచి 99 లోకసభ ఎంపీలు, డీఎంకే, తృణమూల్ కాంగ్రెస్, లెఫ్ట్ పార్టీల మద్దతు కలిపినా సరే ఎన్డీఏ ఆధిపత్యాన్ని దెబ్బకొట్టడం కష్టం.భారత ఉపరాష్ట్రపతి, పార్లమెంటులోని రాజ్యసభకు ఎక్స్-అఫీషియో చైర్మన్ కావడం వల్ల ఈ పదవికి అభ్యర్థిని ఎంపిక చేయడం అధికార కూటమికి వ్యూహాత్మకంగా మారుతుంది. ఎందుకంటే రాజ్యసభలో ప్రతిపక్షాలను అదుపుచేస్తూ సభా కార్యకలాపాలను సజావుగా నిర్వహించడంలో ఆ పదవిలో కూర్చునే వ్యక్తి శక్తి, సామర్థ్యాలు కీలకంగా మారతాయి. అన్నీ ఆలోచించి నాడు ఉపరాష్ట్రతిగా జగ్‌దీప్ ధన్కడ్‌ను ఎంపిక చేసినప్పటికీ.. ఆయన తన అధికార పరిధిని అతిక్రమించి ప్రభావం చూపాలని ప్రయత్నించారనే ఊహాగానాలు చర్చలోకి వచ్చాయి. అప్పట్లో ఉత్తరాదిన హర్యానా, రాజస్థాన్, ఉత్తర్‌ప్రదేశ్, ఢిల్లీ వంటి రాష్ట్రాల్లో గణనీయమైన ప్రభావాన్ని చూపగలిగే శక్తి, సంఖ్యాబలం కలిగిన జాట్ సామాజికవర్గాన్ని మచ్చిక చేసుకుని దగ్గర చేసుకునే ప్రయత్నాల్లో భాగంగా ఆ సామాజికవర్గంలో పలుకుబడి కల్గిన విద్యావంతుడు జగ్‌దీప్ ధన్కడ్‌ను ఎంపిక చేసినట్టు కథనాలు వచ్చాయి. గతాన్ని పక్కనపెట్టి.. వర్తమానంలోకి వస్తే.. కొత్త ఉపరాష్ట్రపతి అభ్యర్థి విషయంలో మోదీ, నడ్డాలు ఎన్నికల లెక్కలు, అంచనాలు, ఊహాగానాలకు అతీతంగా ఆలోచించే అవకాశం ఉంది. కీలకమైన పదవుల విషయంలో బీజేపీ అగ్రనాయకత్వం అందరి ఊహలను తలకిందులు చేస్తూ.. ఎవరూ ఊహించని వ్యక్తులను చివరిక్షణాల్లో తెరపైకి తెచ్చిన ఉదాహరణలు కోకొల్లలు. ఈసారి ఉపరాష్ట్రపతి అభ్యర్థి విషయంలో ఎలాంటి సమీకరణాలకు ప్రాధాన్యత ఇస్తారన్నదే ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. కానీ ఈసారి కచ్చితంగా ఈ తరహా నేపథ్యాలు కల్గినవారికే ఉపరాష్ట్రపతి పదవి ఇస్తారని ఊహించే పరిస్థితి లేదు.దశాబ్దకాలంగా బీజేపీ అనుసరించిన విధానాలు, వ్యూహాలను గమనిస్తే.. కీలక పదవులకు ఎంపిక చేసే అభ్యర్థుల ద్వారా రాజకీయంగా బీజేపీ పాదముద్రలను విస్తరించడానికి ఉపయోగించుకుంది. 2017లో ఉత్తరప్రదేశ్ నుంచి దళిత నాయకుడు రామ్ నాథ్ కోవింద్‌ను రాష్ట్రపతిగా ఎన్నుకున్నప్పుడు, ఆంధ్రప్రదేశ్ నుంచి ఎం. వెంకయ్య నాయుడును ఉపరాష్ట్రపతిగా ఎన్నుకుని, ఉత్తర ? దక్షిణ భారతదేశ సమతుల్యత పాటించింది.2022లో ఒడిశా గిరిజన నాయకురాలు ద్రౌపది ముర్మును రాష్ట్రపతిగా ఎన్నుకోవడంతో, రాజస్థాన్ జాట్ నాయకుడు జగదీప్ ధన్ఖర్‌ను ఉపరాష్ట్రపతిగా ఎన్నుకున్నారు. విభిన్న భౌగోళిక ప్రాంతాలు, కులాలు, సముదాయాలను కవర్ చేసే ఈ రొటేషన్ లాజిక్ ఒక అలిఖిత నియమంగా మారింది. అయితే, ఈసారి పరిస్థితి మరింత సంక్లిష్టంగా ఉంది. ఎందుకంటే బీజేపీ కొత్త జాతీయ అధ్యక్షుడిని ఎన్నుకోవడానికి, తన సంస్థాగత నిర్మాణాన్ని సమీక్షించడానికి సిద్ధమవుతున్న వేళ అకస్మాత్తుగా ఉపరాష్ట్రపతి ఎన్నిక తెరపైకి వచ్చింది. దీంతో ఉపరాష్ట్రపతి అభ్యర్థి ఎంపిక ద్వారా ఏర్పడే ఖాళీ, బీజేపీ జాతీయాధ్యక్షుడి ఎంపిక కసరత్తు.. ఇవన్నీ కేంద్ర మంత్రివర్గంలోనూ భారీ మార్పులు, చేర్పులకు ఆస్కారం కల్గించనుంది. ఉదాహరణకు 2017 మాదిరిగా కేబినెట్ మంత్రిని తీసుకొచ్చి ఉపరాష్ట్రపతి పీఠంపై కూర్చోబెడితే.. ఆ స్థానాన్ని భర్తీ చేయడం ద్వారా మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ అనివార్యంగా మారుతుంది.ఈసారి ఉపరాష్ట్రపతి పదవికి కచ్చితంగా రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ నేపథ్యం కలిగినవారికే అవకాశం ఇవ్వాలని నిర్ణయించినట్టు తెలిసింది. ఈ నేపథ్యం లేనివారికి పదవులు ఇచ్చినప్పుడు వారు పార్టీపై కృతజ్ఞత, విధేయతను ప్రదర్శించకుండా విమర్శకులుగా మారి పార్టీని ఇరకాటంలో పడేసిన సందర్భాలు ఉన్నాయి. ఉదాహరణకు సత్యపాల్ మాలిక్‌ను గవర్నర్‌గా చేస్తే.. ఆయన కేంద్ర ప్రభుత్వంపైనే తీవ్రమైన విమర్శలు, నిరాధార ఆరోపణలు చేసి ఇబ్బందులు సృష్టించారు. ఆ తర్వాత జగ్‌దీప్ ధన్కడ్ సైతం ప్రభుత్వాన్ని ఇరకాటంలో పడేసేలా వ్యవహరించారు. నేపథ్యం లేకపోవడం ఆయకు మైనస్ పాయింట్‌గా మారింది. మ ఎవరిని తెరపైకి తెస్తారు అన్న చర్చ తీవ్ర ఉత్కంఠకు దారితీస్తోంది.ప్రతిపక్షం ఖచ్చితంగా ఒక అభ్యర్థిని నిలబెట్టి, ఎన్డీఏ రాజకీయాలను లక్ష్యంగా చేసుకుని ఒక కథనాన్ని నిర్మించే ప్రయత్నం చేస్తుంది. ఎన్డీఏ తమ అభ్యర్థిని ప్రకటించిన తర్వాత ఇండి కూటమి కూడా తమ అభ్యర్థిని ప్రకటించాలని చూస్తోంది. కానీ ఎన్డీఏ సంఖ్యాబలం కారణంగా, ఈ పోటీ కేవలం పేరుకే తప్ప ప్రతిపక్ష అభ్యర్థి గెలుపు సాధ్యం కాదని ఆ కూటమి నేతలందరికీ తెలుసు. అయితే అధికార కూటమికి వ్యతిరేకంగా విమర్శలు గుప్పించడానికి, తమ ఓటుబ్యాంకును కాపాడుకోడానికి ఈ ఎన్నికలను ప్రతిపక్ష కూటమి ఒక సాధనంగా మార్చుకోవాలని చూస్తోంది.

## కె.ఉబిచర్ల గ్రామంలో భక్తి శ్రద్ధలతో శ్రీకృష్ణాష్టమి వేడుకలు



**గుత్తి -సూర్య వాస్తవం, ఆగస్టు 16:** గుత్తి మండలం కొత్త ఊబిచర్ల గ్రామంలో శ్రీ కృష్ణుని వేడుకలను ఘనంగా నిర్వహించారు.మొదట శ్రీకృష్ణుని విగ్రహానికి అభిషేకంని ర్వహించి,ధూప,దీప నైవేద్యాల ను అర్పించారు. కార్యక్రమానికి గ్రామ ప్రజలు పెద్దలు పిల్లలు తది తరులు పాల్గొని పూజా కార్యక్ర మం నిర్వహించారు.

## వినాయక విగ్రహాలు ఏర్పాటుకు అనుమతులు తీసుకోవాలి

### - డీఎస్పీ చెంచు బాబు



**నాయుడుపేట -సూర్య వాస్తవం ,ఆగస్టు 16:** వినాయక చవితి సందర్భంగా నాయుడుపేట పట్టణం తోపాటు మండలంలో వినాయక ఉత్సవాల్లో భాగంగా విగ్రహాలు ఏర్పాటు చేసే నిర్వాహకులు తప్పనిసరిగా అనుమతులుతీసుకోవాలని నాయుడుపేట డిఎస్పి చెంచు బాబు అన్నారు.శనివారం వినాయక ఉత్సవాల కమిటీల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాల్లో విగ్రహాలు ఏర్పాటు చేసేవారు పోలీస్ విద్యుత్ మున్సిపల్ శాఖ అధికారుల అనుమతులు తీసుకోవాలని తెలియజేశారు.స్థానికులకు ఇబ్బందులు లేకుండా విగ్రహాలు ఏర్పాటు చూడాలన్నారు.విద్యుత్ సరఫరా లో ఎలాంటి అవాంఛనీయ సంఘటన చోటు చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విగ్రహాలు ఏర్పాటు చేసినప్పటి నుంచి నిమజ్జనం చేసే వరకు నిర్వాహకులు రాత్రుల్లో సైతం విగ్రహాల వద్ద ఒకరిని కాపలాగా ఉంచాలని సూచించారు.ప్రశాంత వాతావరణంలో వినాయక ఉత్సవాలు జరుపుకోవాలని తెలియజేశారు.నిబంధనలు పాటించని వారి పై చర్యలు తీసుకుంటామన్నారు.డీఎస్పీ వెంట నాయుడుపేట అర్బన్ సీఐ బాబి ఉన్నారు.

## శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలలో మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం



**నాయుడుపేట -సూర్య వాస్తవం, ఆగస్టు 16:** నాయుడుపేట పట్టణంలోని రాజగోపాలపురం లోని శ్రీరామ మందిరంలో శనివారం శ్రీ కృష్ణాష్టమి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మాజీ ఎంపీ సూళ్లూరుపేట నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు.ఈ సందర్భంగా ఆయనకు యాదవ సంఘం నాయకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.అనంతరం వేద పండితులు శ్రీకృష్ణ భగవానునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం ను ఆశీర్వదించి,తీర్థ ప్రసాదాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు,ఎస్ జె జువెలరీస్ అధినేత పోట్లపూడి రాజేష్, శ్రీ పోలేరమ్మ ఆలయ కమిటీ చైర్మన్ నానబాల సుబ్బారావు,యాదవ సంఘం నాయకులు భారతాల సాయిరామ్ కిషోర్,అత్తికాయల సుబ్రహ్మణ్యం, యాదపల్లి జనార్ధన్,అక్కుపల్లి చరణ్,సురేంద్ర,తెలుగుదేశం పార్టీ నాయకులు అవధానం సుధీర్, బిరదవాడ నారాయణ,మల్లాం రవికుమార్,వినుకొండ ధనుంజయ, మునీంద్ర, సురేంద్ర పలువురు యాదవ సోదరులు పాల్గొన్నారు.

## మీరు ఎవరికి ఓటు వేసినా గెలిచేది బీజేపీనే....

### - నెట్టింట బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్ వీడియో వైరల్



**తెలంగాణ,- సూర్య వాస్తవం, ఆగస్టు 16:** ఓటు చోరీ వ్యవహారం తెలంగాణకు పాకడం రాష్ట్ర రాజకీయాల్లో కలకలం రేపుతోంది. మీరు ఎవరికి ఓటు వేసినా గెలిచేది బీజేపీనే అంటూ గతంలో తెలంగాణ బీజేపీ ఎంపీ చేసిన వ్యాఖ్యలకు సంబంధిచిన వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది. **ఎవరికి ఓటేసినా గెలిచేది బీజేపీనే:** ఓటు చోరీ అంశంపై పెద్దఎత్తున వివాదం సాగుతున్న వేళ నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ గతంలో చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నది. 'మీరు నోటాకు ఓటు వేసినా నేనే గెలుస్తా. మీరు కారు గుర్తుకు ఓటు వేసినా నేనే గెలుస్తా. హస్తం గుర్తుకు ఓటు వేసినా నేనే గెలుస్తా. మీరు ఎవరికి ఓటు వేసినా రాబోయేది మోడీనే' అంటూ అర్వింద్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు తీవ్ర ఆందోళనలు రేకెత్తిస్తున్నాయి. నిజానికి అర్వింద్ మాట్లాడిన ఈ వీడియో 2023 ఆగస్టుకు సంబంధించినది అని తెలుస్తోంది. కానీ ప్రస్తుతం ఓటర్ల జాబితా, ఈవీఎంల కాంట్రవర్సీ నేపథ్యంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ మద్దతుదారులు సోషల్ మీడియాలో అర్వింద్ పాత వీడియోను వైరల్ చేస్తున్నారు. ఎన్నికల్లో బీజేపీ తప్పుడు మార్గాల్లో గెలిచిందనడానికి అర్వింద్ చేసిన వ్యాఖ్యలే నిదర్శనం అంటూ కామెంట్ చేస్తున్నాయి.



## ఆ నటికి థర్డ్ క్లాస్ లోనే ఉప్పెనొచ్చిపోయింది!

**- తాజాగా కృతిశెట్టి క్రష్ గురించి రివీల్ చేసింది. బేబమ్మకు ఏ హీరోపై క్రష్ లేదు కానీ ..స్కూల్లో ఉన్న సమయంలో స్నేహితుడి స్నేహితుడిపై మాత్రం క్రష్ ఉండేదని తెలిపింది**

క్రష్ లేని హీరోయిన్ ఉండదు. స్టార్ హీరోలపై నవతరం భామల క్రష్ ఎప్పటికప్పుడు రివీల్ చేస్తూనే ఉంటా రు. సినిమాల్లోకి రాకముందే? స్కూల్....కాలేజ్...జాబ్ చేస్తోన్న సమయంలోనూ భామా మణుల క్రష్ విష యాలు ఎంతో ఓపెన్ గా చెబుతుంటారు. సినిమాల్లోకి వచ్చిన తర్వాత హీరోలపై క్రష్‌ని అంతే ఓపెన్ అవుతుంటారు. తాజాగా కృతిశెట్టి క్రష్ గురించి రివీల్ చేసింది. బేబమ్మకు ఏ హీరోపై క్రష్ లేదు కానీ ..స్కూల్లో ఉన్న సమయంలో స్నేహితుడి స్నేహితుడిపై మాత్రం క్రష్ ఉండేదని తెలిపింది. క్రష్ లేని హీరోయిన్: స్కూల్ అంటే హైస్కూల్ కూడా కాదు. ఎలిమెంట్రీ స్కూల్ క్రష్ ఇది. మూడవ తరగతి చదువుతోన్న సమ యంలో ఉన్న క్రష్ ఇది. తొలిసారి అబ్బాయిపై క్రష్ అన్నది ఉప్పొనొచ్చినట్లు వచ్చి పోయిందని తెలిపింది. ఆ తర్వాత ఎవరి మీద ఎలాంటి క్రష్ లేదని తెలిపింది. స్కూల్..కాలేజ్..సినిమాల్లోకి వచ్చిన తర్వాత ఎవరైనా? అంటే ఛాన్సే లేదని తేల్చేసింది. అంటే బేబమ్మకు ఏ హీరోపైనా క్రష్ లేదని క్లియర్ చెప్పినట్లు. ఇక ఈ కన్నడిగ జర్నీ గురించి చెప్పాల్సిన పనిలేదు. టాలీవుడ్ కి తారా జువ్వలా దూసుకొచ్చినా? కెరీర్ ని మాత్రం సక్సస్ ఫుల్ గా కొనసాగించ లేకపోయింది. ఉప్పెన తో మెరిసినా ఆసక్సెస్ ని సరిగ్గా ట్రాక్ ఎక్కించలేకపోయింది. అవకాశాలొచ్చినా? అమ్మడికి సక్సస్ రూపంలో అదృష్టం కలిసి రాలేదు. కృతి అందం..అభినయానికి పెద్ద స్టార్ అవుతుందనుకున్న వారి అంచనాలు తల్లకిందులయ్యాయి. ప్రస్తుతం కృతి కోలీవుడ్ లో కెరీర్ ని నెట్టికొస్తుంది. అక్కడ మాత్రం మంచి అవకాశాలే అందుకుంటుంది. కార్తీ హీరోగా నటిస్తోన్న వా వత్తైయార్‌లో నటిస్తోంది. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఉంది. అలాగే నయనతార ప్రొడక్షన్ హౌపస్ లో తెరకెక్కుతోన్న 'లవ్ ఇన్సురెన్స్ కంపెనీ' లో నటిస్తోంది. ఇందులో ప్రదీప్ రంగనాధ్ హీరో. అన్ని పనులు పూర్తి చేసుకుని సెప్టెంబర్ లో రిలీజ్ కానుందీ చిత్రం. అలాగే 'జెన్నీ' అనే మరో చిత్రం లోనూ నటిస్తోంది. ఈ రెండు సినిమాలపై కృతి చాలా ఆశలు పెట్టుకుంది. సక్సస్ తో కోలీవుడ్ లో స్ట్రాంగ్ గా నిలబడాలని చూస్తోంది. అక్కడ విజయాలతో టాలీవుడ్ లోనూ కంబ్యాక్ అవ్వాలని చూస్తోంది. ఇక్కడ అవకాశాలు

## నాగార్జునను అంత మాట అనేసిన జగపతిబాబు.. ఊహించలేదుగా



జగపతిబాబు హోస్ట్‌గా చేస్తున్న జయమ్ము నిశ్చయమ్మురా షోకి ఫస్ట్ గెస్ట్‌గా అక్కినేని నాగార్జున ఎంట్రీ ఇచ్చారు. ఇప్పటికే ఈ షో నుండి వచ్చిన ప్రోమోలు షోకి భారీ హైప్ ని తెచ్చి పెట్టాయి. అయితే ఈ షోకి సంబంధించిన ఫుల్ ఎపిసోడ్ ఆగస్టు 17న రాత్రి 9 గంటలకు స్ట్రీమింగ్ అవుతుంది.. అయితే ఈ షోకి సంబంధించిన ఎన్నో ప్రోమోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. అయితే తాజాగా అలాంటి ఒక వీడియోనే సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. అయితే ఆ వీడియో చూసిన చాలా మంది నెటిజన్లు ఇదేంటి నాగార్జునని జగపతిబాబు అంత మాట అన్నారు అంటూ ఆశ్చర్యపోతున్నారు..మరి ఇంతకీ నాగార్జునను జగపతిబాబు ఏమన్నారు అనేది ఇప్పుడు తెలుసుకుందాం.. జగపతిబాబు, నాగార్జున ఇద్దరూ మంచి స్నేహితులట. సినిమాల్లోకి రాకముందు నుండే జగపతిబాబుకి నాగార్జున తెలుసట. అలా వీరి మధ్య ఫ్రెండ్షిప్ ఏర్పడింది. అలాగే జగ్గూ భాయ్ సినిమాల్లోకి రావడానికి మెయిన్ రీజన్ కూడా నాగార్జుననే అని, ఆయన్ని చూసే నేను హీరో అవ్వాలని ఇన్స్పైర్ అయ్యానంటూ చెప్పుకొచ్చారు. అలాగే ఈ షోలో తన మనసులో ఉన్న ప్రశ్నలన్నీ అడిగేసారు జగపతి బాబు. ఇందులో భాగంగా చిన్నా చితకా పాత్రలు చేస్తూ నేను ఇండస్ట్రీలో రాణిస్తున్నాను. కానీ నువ్వు ఎందుకు కూలీ మూవీలో విలన్ గా చేసావు అంటూ ప్రశ్న అడగడంతో షాకింగ్ ఆన్సర్ ఇచ్చారు నాగార్జున.ఒకడు పుట్టగానే వాడు ఎవడి చేతిలో చావాలి అనేది వాడి నుదుటిపై రాసి ఉంటుంది.. అంటూ మాట్లాడడంతో నాగ్ కి సంబంధించిన ఈ వీడియో నెట్టింట చక్కర్లు కొడుతుంది. అలాగే నాగార్జున కొడుకు అఖిల్ రాబోయే లేటెస్ట్ మూవీ లో ఓ చిన్న పాత్ర కోసం జగపతిబాబుని అడిగారట. అయితే ఇదే విషయాన్ని జగపతిబాబు నాగార్జునని అడుగుతూ.. అఖిల్ మూవీలో నన్ను చిన్న రోల్ కోసం అడిగితే నో నో అంత చిన్న పాత్రలో ఆయన్ని వద్దని,అంత చిన్న పాత్ర కోసం ఆయన్ని అడిగితే మా మధ్య ఉన్న ఫ్రెండ్షిప్ పోతుంది అని చెప్పావట కదా అంటూ గుర్తు చేశారు జగపతి బాబు. దానికి నాగార్జున అవును అంత చిన్న పాత్రలో మిమ్మల్ని చూడడం నాకు ఇష్టం లేదు.అందుకే వద్దని చెప్పానని నాగార్జున ఆన్సర్ ఇచ్చారు.దానికి జగపతిబాబు థాంక్స్ చెబుతూ.. ఆ సీన్ కోసం ఫుడ్ తినడం కూడా మానేసిందట!
%ూాఎజవతీఅంవఎవత్% అసలు ఈ విషయంలో మీకు సంబంధం లేదు.కానీ మీరు చేసిన పనికి నిజంగా మీకు థాంక్స్.. ఐ లవ్ యువర్ ఎథిక్స్ అంటూ నాగార్జునని పొగిడారు జగపతిబాబు. అయినా దీనికంటే ముందు మనం ఫ్రెండ్స్ కదా అంటూ నాగార్జున కూడా చెప్పడంతో ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. అలా అఖిల్ సినిమాలో చిన్న పాత్ర కోసం జగపతిబాబుని అడిగితే ఆయనకు అవసరం లేకున్నా కూడా అలాంటి పాత్రలో వద్దని చెప్పి జగపతి బాబు క్రేజ్ ఎలాంటిదో బయట పెట్టారు నాగార్జున.





## ఛెత్రీకి నో ఛాన్స్

**కోల్‌కతా:** భారత ఫుట్‌బాల్ లెజెండ్ సునీల్ ఛెత్రీకి బిగ్ షాక్. జట్టుకోసం వీడ్కోలు నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్న ఛెత్రీకి సెంట్రల్ ఆసియా ఫుట్‌బాల్ అసోసియేషన్(సిఎఎఫ్ఎ) నేషన్స్ కప్ ప్రాబబుల్స్ కోసం ఎంపిక చేసిన బృందంలో చోటు దక్కలేదు. ఛెత్రీని తీసుకోకపోవడానికి కారణం ఏమిటో తెలియరాలేదు. అటు భారత ఫుట్‌బాల్ సమాఖ్య (ఎఐఎఫ్ఎఫ్)గానీ, ఇటు కొత్త కోచ్ ఖలీత్ జమిల్‌గానీ ఈ విషయంపై ఎలాంటి అభిప్రాయాన్ని వెల్లడించలేదు. దాంతో, కొన్నేళ్లుగా బ్లూ టైగర్స్‌కు కీలక విజయాలను అందించిన ఈ మాజీ సారథి అంతర్జాతీయ కెరీర్‌పై సందేహాలు తలెత్తుతున్నాయి. గత ఏడాది జూన్‌లో వీడ్కోలు పలికిన ఛెత్రీ ఈ ఏడాది యూటర్న్ తీసుకున్నాడు. చెత్త ఆటతో వరుసగా ఓడిపోతున్న బ్లూ టైగర్స్‌ను విజయపథాన నడిపించేందుకు సిద్ధమయ్యాడు. అయినా సరే సెలెక్టర్లు అతడికి మొండిచేయి చూపించారు. నేషన్స్ కప్ కోసం ఎంపిక చేసిన 35 మందిలో ఛెత్రీ ఆడుతున్న బెంగళూరు ఎఫ్‌సికి చెందిన ఆటగాళ్లు ఉన్నారు. గుర్‌ప్రీత్ సింగ్, రాహుల్ భెకే, రోషన్ సింగ్, సురేష్ సింగ్‌లను తీసుకున్న సెలెక్టర్లు స్టార్ ఫార్వర్డ్ అయిన ఛెత్రీని విస్మరించారు. ఆగస్టు 29న ఉజ్బెకిస్థాన్, తజకిస్థాన్ వేదికగా నేషన్స్ కప్ ప్రారంభం కానుంది. ఈ టోర్నీలో భారత జట్టు గ్రూప్-బిలో ఉంది. ఇందులోనే ఆతిథ్య తజకిస్థాన్, ఇరాన్, అఫ్గనిస్తాన్ ఉన్నాయి.

### నిప్పులు చిమ్ముతూ నేలకు ఎగిసి..

## నేలకు రాలిన భారత రాకెట్

**-ఎందరో మహానుభావులు అని గతం గురించి మాట్లాడుకునే కథగా మారింది. టాప్ నుంచి టాప్10లోనూ లేని విధంగా మారింది**



ఒకప్పుడు ఉజ్వలంగా వెలుగు వెలిగిన భారత రాకెట్ నేడు నేల చూపులు చూస్తోంది. కనీసం సమీయ భవిష్యత్ లో పైకి లేచే అవకాశం కనిపించడం లేదు. నిప్పులు చిమ్ముతూ నింగికి ఎగిసి.. నేలకు రాలిన భారత రాకెట్ అని చెప్పుకొనే పరిస్థితి వచ్చింది. ఎందరో మహానుభావులు అని గతం గురించి మాట్లాడుకునే కథగా మారింది. టాప్ నుంచి టాప్10లోనూ లేని విధంగా మారింది. పతకాల నుంచి పతనం వైపు... పైన చెప్పుకొన్నదంతా భారత బ్యాడ్మింటన్ గురించి. సైనా నెహ్వాల్, తెలుగమ్మాయి పీవీ సింధు, కిదాంబి శ్రీకాంత్, సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి, లక్ష్యసేన్..! ఇటీవలి వరకు భారత బ్యాడ్మింటన్ లో వెలుగులు వీరు. కానీ, ఒక్కొక్కరు క్రమంగా వెనుకబడుతున్నారు. సైనా ఆటకు దూరం కాగా.. సింధు ఫామ్ కోల్పోయింది. పదేళ్ల కిందట వరల్డ్ నంబర్ వన్ అయిన సైనా, 8 ఏళ్ల కిందట ప్రపంచ నంబర్ 2 అయిన సింధుల శకం చూస్తే భారత బ్యాడ్మింటన్ కు తిరుగులేదని అనిపించింది. ఏడేళ్ల కిందట శ్రీకాంత్ ప్రపంచ నంబర్ వన్.. అంతెందుకు.. రెండేళ్ల ముందటి వరకు సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి జోడీ డబుల్స్ నంబర్ వన్. 2012 లండన్ ఒలింపిక్స్ లో సైనా కాంస్యం, 2016 రియో క్రీడల్లో సింధు రజతంతో భారత బ్యాడ్మింటన్ స్థాయి ఎక్కడికో వెళ్లింది. అదే సమయంలో పురుషుల్లోనూ మెరికల్లాంటి క్రీడాకారులు దూసుకొచ్చారు. అలా 2024 వరకు పుష్కర కాలం ఓ వెలుగు వెలిగింది. కానీ, ఇప్పుడు మహిళల్లో టాప్ 10లో ఒక్కరూ లేరు. తెలుగమ్మాయి పీవీ సింధు 15వ ర్యాంకే అత్యుత్తమం. పురుషుల్లో లక్ష్యసేన్ (21వ ర్యాంక్) మాత్రమే కాస్త మెరుగ్గా ఉన్నాడు. డబుల్స్ లో సాత్విక్-చిరాగ్ శెట్టి (9వ ర్యాంక్)లు అప్పుడప్పుడు మెరుపులు మెరిపిస్తున్నారు. టోక్యో తర్వాత టాటా... టోక్యో ఒలింపిక్స్ లో పీవీ సింధు కాంస్యం తర్వాత భారత భాగ్య రేఖ మళ్లీ పైకి లేవలేదు. కిదాంబి శ్రీకాంత్ ఆసియా, కామన్వెల్త్ క్రీడల్లో మెరిసి ప్రపంచ టాపర్ అయ్యాడు. ఇక డబుల్స్ లో సాత్విక్-చిరాగ్ కూడా కొన్ని కీలక మైలురాళ్లు లాంటి విజయాలు సాధించారు. 2022 థామస్ కప్ విజయం, ఆ తర్వాత ఏడాది సాత్విక్ జోడీ టాప్ ర్యాంక్ తర్వాత రెండేళ్ల నుంచి ఓదార్పుగా టైటిల్ కూడా దక్కడం లేదు. పారిస్ ఒలింపిక్స్ లో నిరుడు ఉత్తచేతులతో రాగా.. ఈ ఏడాది పీవీ సింధు పేలవ ఫామ్ కొనసాగుతోంది. పది టోర్నీల్లో ఐదుసార్లు తొలి రౌండ్ లోనే ఓడింది.

# అధికారికంగా గౌతు లచ్చన్న జయంతి వేడుకలు

**- అనంతపురంలో సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహాన్ని ఏర్పాటు చేస్తాం: ఎమ్మెల్యే దగ్గుపాటి**
**- ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే దగ్గుపాటి, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ సహార్**
**- ఈడిగ కులస్తులకు మద్యం షాపులు, బార్లలో 10శాతం రిజర్వేషన్ ఇచ్చాం**

**అనంతపురం క్రైం - సూర్య వాస్తవం, ఆగస్టు 16:** అనంతపురం నగరంలో సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. అనంతపురం జిల్లా కలెక్టరేట్లో తొలిసారిగా అధికారికంగా గౌతు లచ్చన్న జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తో పాటు అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ సహార్, ఈడిగ కులస్తులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ముందుగా గౌతు లచ్చన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ స్వాతంత్ర ఉద్యమంలో సర్దార్ గౌతు లచ్చన్న పాత్ర చాలా కీలకమని.. ఆయన పోరాట పటిమ ప్రతి ఒక్కరికి స్ఫూర్తిగా ఉంటుందని అన్నారు. ఆయన జయంతిని అధికారికంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు.. ఎమ్మెల్యే గౌత శిరీషతో పాటు తాము కూడా విజ్ఞప్తి చేశామన్నారు. ప్రభుత్వం ఈసారి అధికారికంగా నిర్వహించేలా ఆదేశాలు ఇచ్చిందని.. ఇందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. కలెక్టరేట్ లో అధికారికంగా ఈ వేడుకలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. గౌతు లచ్చన్న విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు అనంతపురంలో ప్రత్యేకంగా స్థలాన్ని కేటాయించమన్నారు. ఈ విగ్రహ ఏర్పాటును నా బాధ్యతగా తీసుకుంటారని స్పష్టం



చేశారు. ఈడిగ కులస్తులకు మద్యం దుకాణాలు, బార్లలో 10శాతం రిజర్వేషన్ కల్పించిన ప్రభుత్వం కూటమి ప్రభుత్వం అన్నారు. గతంలో మద్యం దుకాణాలు ఎలా నిర్వహించారో ప్రతి ఒక్కరికి తెలుసునన్నారు. అలాగే కల్లు దుకాణాలకు లైసెన్స్ కావాలని కొందరు ఈడిగ కులస్తులు కోరారని.. దీనిని ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈడిగ గౌడ శెట్టిబలిజ శ్రీశయన యాత కులస్తులకు సంబంధించిన ఐదు ఎకరాల స్థలం అన్యాక్రాంతం అవుతోందని తన దృష్టికి తీసుకొచ్చారని..దీనిని సంరక్షించే బాధ్యత నాది అని దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. ఈడిగ కులస్తులు నిర్ణయించిన ప్రకారం ఆ స్థలం విషయంలో ప్రభుత్వంతో మాట్లాడుతామని హామీ ఇచ్చారు. బీసీ భవన్ కు ఇప్పటికే 40 సెంట్లు కేటాయించారని.. ఇందుకు సంబంధించి త్వరలోనే ప్రకటన ఉంటుందని తెలిపారు. తన గెలుపులో ఈడిగ కులస్తుల పాత్ర ఎంతో ఉందని.. వారిని ఎప్పటికీ నేను మరువలేనని ఎమ్మెల్యే దగ్గుపాటి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో మలోల, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ మరియు సాధికార అధికారిణి ఖుష్బూ కొఠారి, బిసి కార్పొరేషన్ ఈ డి సుబ్రహ్మణ్యం, టిడిపి రాష్ట్ర ఈడిగ సాధికారిక సభ్యులు వేణుగోపాల్, జనరల్ సెక్రటరీ శ్రీనివాసులు, పలు కార్పొరేషన్ డైరెక్టర్లు పోతుల లక్ష్మీనరసింహులు, పి ఎల్ ఎన్ మూర్తి, పరమేశ్వర్, కడియాల కొండన్న, నాగభూషణం, రామకృష్ణ, నారాయణస్వామి, లాలెప్ప, గోపాల్, జగదీష్, ఈశ్వరయ్య, వెంకటేష్, నాగేశ్వరరావు, జల్లిపల్లి చంద్ర, సురేంద్ర, ఆది నారాయణ, శివకుమార్, రామ్మోహన్, రాజు, విశ్వనాథ్, మనోహర్, విజయ్, తరుణ్, శ్రీనివాస్, హేమంత్, నాగభూషణ, గంగాధర, ప్రసాద్, లక్ష్మీ నారాయణ, మారుతి, సుధాకర్, హరి, వివేక్, శ్రీకాంత్, రమేష్, జయప్ప, లక్ష్మీనారాయణ, రాము, రాజేంద్ర, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



## భక్తి శ్రద్ధలతో శ్రీకృష్ణాష్టమి వేడుకలు



**గాండ్లపెంట -సూర్య వాస్తవం, ఆగస్టు 16:** మండలంలోని వేపలకుంట గ్రామంలో శ్రీ కృష్ణుని వేడుకలను ఘనంగా నిర్వహించారు.మొదట శ్రీకృష్ణుని విగ్రహానికి అభిషేకం నిర్వహించి,ధూప,దీప నైవేద్యాలను అర్పించారు.ఎద్దుల బండి మీద శ్రీకృష్ణుడుని వుంచి యువకులు ఎద్దుల బండిని లాగి,చెక్క భజనలతో, శ్రీకృష్ణుని నామాలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## ఘనంగా నాలుగవ శ్రావణమాస పూజలు



**గాండ్లపెంట- సూర్య వాస్తవం, ఆగస్ట్ 16:** మండల వ్యాప్తంగా శ్రావణమాసం నాలుగవ శనివారం సందర్భంగా భక్తులు ఆంజనేయ స్వామి ఆలయాలకు భక్తులు పోటెత్తారు.మునగాలవారిపల్లి శ్రీగరుడాంజనేయ స్వామికి ఉదయం భక్తులు అభిషేకము నిర్వహించారు. అనంతరము ఆకుపూజ కార్యక్రమం నిర్వహించారు టెంకాయలు కొట్టి భక్తితో స్వామిని పూజించారు.అనంతరం భక్తులకు తీర్థ ప్రసా దాలను అందజేశారు.మండల వ్యాప్తంగా వేపరాల, గాండ్లపెంట, కోటూరు, బొలుగుట్లపల్లి, రెక్కమను, మల్లమీదపల్లి, గొడ్డు వెలగల , కటారుపల్లి పలు ఆంజ నేయస్వామి ఆలయాల్లో ఆంజనేయ స్వామికి ఆకు పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలను భక్తులకు అందజేశారు.

## గణేష్ ఉత్సవాలు శాంతియుతంగా జరగాలి

**- సీఐ సంగమేశ్వరరావు హెచ్చరిక**



**పెళ్లకూరు-సూర్యా వాస్తవం, ఆగస్టు 16:** తిరుపతి జిల్లా నాయుడుపేట డిఎస్పి ఆదేశాల మేరకు శనివారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో గణేష్ ఉత్సవాల నిర్వహణ కమిటీలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. నాయుడుపేట రూరల్ సీఐ సంగమేశ్వరరావు ఆధ్వర్యంలో, దొరవారిసత్రం ఎస్సై అజయ్‌కుమార్ సమన్వయంతో ఈ సమావేశం జరిగింది.ఈ సందర్భంగా సీఐ సంగమేశ్వరరావు మాట్లాడుతూ గ్రామాలలో జరగనున్న గణేష్ ఉత్సవాల సమయంలో డిజే సౌండ్ సిస్టమ్స్ వినియోగం, మద్యపానం, ఇతరులను ఇబ్బంది పెట్టే విధమైన చర్యలు ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబడవని స్పష్టం చేశారు. దైవారాధనలో ఎటువంటి సమస్యలు తలెత్తినా, సంబంధిత ఉత్సవ కమిటీలపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఉత్సవాలను శాంతియుతంగా, భక్తి భావంతో జరిపేందుకు కమిటీ సభ్యులు కృషి చేయాలని ఆయన సూచించారు.

### ప్రాణాలు హరిస్తున్న

# కల్లు దుకాణాలను తక్షణమే సీజ్ చేయాలి

**- రాయదుర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి గౌని ప్రతాప్ రెడ్డి డిమాండ్**

**రాయదుర్గం- సూర్య వాస్తవం, ఆగస్టు 16:** రాయదుర్గంలో తయారు చేస్తున్న కల్తీకల్లు పై కర్ణాటక అసెంబ్లీలో ఎమ్మెల్యే ప్రస్తావించడం ఆందోళన కలిగించిందన్నారు.రాయదుర్గం నియోజకవర్గంలో ఎక్సైజ్ అధికారుల నిర్లక్ష్యంతో కల్తీకల్లు తాగి యువకులు ప్రాణాలు కోల్పోతున్నారని కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి గౌని ప్రతాప్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మీడియాకి ఆయన వీడియో విడుదల చేశారు. మన రాయదుర్గం నియోజకవర్గం నుండి కల్తీకల్లు కర్ణాటకకు సైతం సరఫరా అవుతుండడంతో అక్కడ ఎంతో మంది యువకులు మృతి చెందిన విషయాన్ని సండూర్ ఎమ్మెల్యే గారు అసెంబ్లీలో ప్రస్తావించడం చూసి చలించిపోయానన్నారు. గతంలో రాయదుర్గంలో అడపా దడప తనిఖీలు నిర్వహించి కల్లు డిపో ని సీజ్ చేసి చేతులు దులుపుకున్నారన్నారు.అయితే ప్రాణాంతకమైన క్లోరైడ్ హైడ్రేట్ ను కల్లులో కలిపి



ధనార్జనే ధ్యేయంగా వ్యాపారాలు కొనసాగిస్తున్నప్పటికీ స్థానిక ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు మౌనం వహించడం ఏంటో అర్థం కావడం లేదన్నారు. సంబంధిత అధికారులకు ప్రభుత్వ జీతాలు, గీతాలు వస్తున్నప్పటికీ వేరే ఆదాయం కోసం చూసి చూడనట్టుగా యువకుల ప్రాణాలతో చెలగాటం ఆడేలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. యువ ఉదవుల ఉసురు తగలకుండా చూసుకోవాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వానికి లేదా అని ఆయన నీలాదీశారు, ఆదర్శ ప్రాయుడైన ఎమ్మెల్యే కాలువ గారు ఎందుకు కల్తీకల్లు ఇంత పెద్ద ఎత్తున సరఫరా అయ్యి కల్తీ కల్లు తాగి యువకులు ప్రాణాలు కోల్పోతున్న ఎందుకు మౌనం వహిస్తున్నారో తెలపాలన్నారు. కర్ణాటకలో 160కి పైగా అక్కడి పోలీసులు కేసులు నమోదు చేశారన్నారు. అయితే ఇంత పెద్ద ఎత్తున కల్తీ కల్లు సరఫరా చేస్తున్న మన నియోజకవర్గం ఎక్సయసే పోలీస్లు ఎంతమందిపై కేసులు నమోదు చేశారో తెలపాలని డిమాండ్ చేశారు. అక్కడి కర్ణాటక ఎమ్మెల్యే రాయదుర్గం నుంచి వస్తున్న కల్తీ కల్లును తమ రాష్ట్రంలోకి రాకుండా అడ్డుకోవాలని కోరిందంటే తమ నియోజకవర్గంలో ఇంత పెద్ద ఎత్తున కల్తీ కల్లు సరఫరా జరుగుతుండడం ఆందోళనకు గురి చేసిందన్నారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులు యువకుల ప్రాణాలను కాపాడే దిశగా కల్తీ కల్లును పూర్తిగా రద్దు చేయించేలా చూడాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

## 4వ శ్రావణ శనివారం వేడుకలు

**-ప్రత్యేక పూజలు , అన్నదానం కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర టీడీపీ కార్య నిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్ బాబు**



**అన్నమయ్య బ్యూరో -సూర్య వాస్తవం, ఆగస్టు 16:** శ్రావణమాసం 4వ శనివారం సందర్భంగా అన్నమయ్య జిల్లా రాయచోటి పట్టణం మాండవ్య నది ఒడ్డున ఉన్న శ్రీ ప్రసన్నా ంజనేయ స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో 4వ శనివారం వేడకలు ఘనంగా నిర్వహించారు. కాగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి టిటిడి పాలకమండలి మాజీ సభ్యులు రాయచోటి నియోజకవర్గం టిడిపి సీనియర్ నాయకులు సుగవాసి ప్రసాద్ బాబు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.చివరి శ్రావణ శనివారం నేపథ్యంలో పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.వారందరికీ అన్నదానం చేశారు, రామనామ స్మరణతో ఆలయ పరిసరాలు మారుమోగాయి.ఈ సందర్భంగా ప్రసాద్ బాబు మాట్లాడుతూ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో, శాంతి సౌభాగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ప్రసాద్ బాబు ని ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.కార్యక్రమానికి హాజరైన ప్రసాద్ బాబు గారికి ఆలయ కమిటీ వాకా అన్నయ్య ఆత్మీయ స్వాగతం పలికి శాలువా గజమాలతో ఘనంగా సన్మానించారు.



### మహిళా ఉద్యోగులకు

# ఉచిత బస్సు పథకం అమలు చేయడం హర్షణీయం

**- మంత్రి మండిపల్లిని కలిసి అభినందించిన ఎన్‌టీఏ నేతలు**

**అన్నమయ్య బ్యూరో -సూర్య వాస్తవం, ఆగస్టు 16:** స్త్రీ శక్తి పథకం కింద మహిళా ఉద్యోగులకు కూడా ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తూ కూటమి ప్రభుత్వం విధివిధానాలను తీసుకురావడం పట్ల నోబెల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కొండూరు శ్రీనివాసరాజు హర్షం వ్యక్తం చేశారు.శనివారం ఆయన ఎన్టిఏ నేతలతో కలిసి రాష్ట్ర రవాణా యువజన క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డినిమర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు.

అనంతరం వారు మాట్లాడుతూ కూటమి సర్కార్ సూపర్ సిక్స్ పథకాలలో భాగంగా స్త్రీ శక్తి పథకం అమలు చేయడమే కాకుండా ఉచిత బస్సు సౌకర్యం ప్రభుత్వ మహిళా ఉద్యోగులకు కూడా వర్తించే విధంగా నియమ నిబంధనలు తయారుచేసి అమలు చేస్తున్నందుకు వారు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక



కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న యాప్ ల సమస్యలపైన,2 025 సాధారణ బదిలీలలో భాగంగా బదిలీ ఉత్తర్వులు పొంది రిలీవర్ రాకపోవడంతో రిలీవ్ కానీ ఉపాధ్యాయుల స్థానాలలో డిఎస్సి ఉపాధ్యాయులను నియమించి వారికి న్యాయం చేసే విధంగా విద్యాశాఖ మంత్రి లోకేష్ తో చర్చించి న్యాయం చేయాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని కోరారు.ఇందుకు సాను కూలంగా స్పందించిన మంత్రి మండిపల్లి తప్పకుండా అలాంటి ఉపాధ్యాయులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూస్తానన్నారు.అదేవిధంగా గత కొన్ని సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్న డిఏ బకాయిలలో కనీసం రెండు డీఏలను ఇప్పించే విధంగా ప్రభుత్వంతో చర్చించి న్యాయం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో నోబెల్ టీచర్స్ అసోసియేషన్ నేతలు మడితాడి నరసింహారెడ్డి,బచ్చల శ్రీనివాసులు, కొండూరు మురళి మోహన్ రాజు, వంగిమళ్ళ వేణుగోపాలరావు, కదిరి హరినాథ్,చిన్న రెడ్డయ్య రాజు తదితరులు పాల్గొన్నారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 ( ASSOCIATE EDITOR -N.ARIF ALI )